PRAJASAKTI Regd.No. 15795/68

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 3 | విజయవాడ, శనివారం 3 ఆగస్టు 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 3 August 2024 | Rs

## ఫీల్డ్ అసిస్టెంట్లపై వేధింపులు ఆపండి

- ఉద్యోగ భద్రత కల్పించాలి
- పంచాయతీరాజ్ కమిషనరేట్ వద్ద బైఠాయింపు

• లోపలి పేజీలో..

## 52ఏళ్ల తర్వాత ఒలింపిక్ హాకీలో ఆస్ట్రేలియాపై గెలుపు

- హ్యాట్రిక్ పతకానికి చేరువలో మను

8

# నీట్‌లో అవకతవకలపై ఎన్‌టిఎకు చీవాట్లు

- నీట్ (యుజి)-2024 పరీక్ష రద్దుకు తిరస్కృతి
- సుప్రీం తీర్పు

**న్యూఢిల్లీ :** నీట్ (యుజి)-2024 పరీక్షను రద్దు చేయాలన్న అభ్యర్థనలను తిరస్కరించిన సుప్రీం కోర్టు ఈ పరీక్షలో నిర్వహణలో అనేక అవకతవకలకు ఆస్కారమిచ్చిన ఎన్‌టిఎను తీవ్రంగా మందలించింది. సర్వోన్నత న్యాయస్థానం ఈ మేరకు శుక్రవారం తీర్పు ఇచ్చింది. అయితే ఈ లోపాలు, వైఫల్యాలు విస్తృత స్థాయిలో పేపర్ లీకేజికి దారితీసినట్లు నిర్ధారణకు రాలేమని కోర్టు పేర్కొంది. యావత్ పరీక్షా ప్రక్రియ పవిత్రతను దెబ్బతీసిన పలు వైఫల్యాలను సుప్రీం ధర్మాసనం ఎత్తి చూపింది. భవిష్య త్తులో ఇటువంటి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. నీట్ పరీక్షకు తీవ్ర పోటీ ఉంటుంది. మొత్తం 23 లక్షల మంది పరీక్ష రాశారు. ఇప్పటివరకు చర్చించిన లోపాలు నీట్ సమగ్రతను వ్యవస్థాగత స్థాయిలో దెబ్బతీశాయన్న నిర్ధారణకు దారితీయవని పేర్కొంది. ఈ సంవత్సరం పరీక్షను నిర్వహించిన తీరు తీవ్ర ఆందోళనకు కారణమైందని సుప్రీం కోర్టు పేర్కొంది. పరీక్ష ప్రక్రియను మొత్తంగా పునర్వ్యస్థీకరించాలని కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం వివరణాత్మక తీర్పు వెల్లడించింది. భారత అంతరిక్ష పరిశోధాన సంస్థ (ఇస్రో) మాజీ చైర్‌పర్సన్ కె. రాధాకృష్ణన్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ చేసే సిఫార్సులు అమలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. నీట్ యుజి 2024 సమయంలో కొన్ని పరీక్షా కేంద్రాలకు ప్రశ్నా పత్రాలను ఇ-రిక్షాల ద్వారా ఎలా రవాణా చేశారని ఎన్‌టిఎను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. విద్యార్థులు భరించలేని విధంగా ఎన్‌టిఎ 'లగ్జరీ' ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ పేర్కొన్నారు. 'హైపవర్ కమిటీ సిఫార్సులు ద్వారా కేంద్రం నీట్ ప్రక్రియను మొత్తంగా పునర్వ్యవస్థీకరించాలని ఎన్‌టిఎ తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఉద్దేశించి చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ అన్నారు.. ప్రశ్నాపత్రాల లీకేజ్, నిబంధనల ఉల్లంఘన గురించి ఎన్‌టిఎ ఇచ్చిన భిన్నమైన వాదనలను సుప్రీంకోర్టు తిరిస్కరించింది. 1563 విద్యార్థులకు వారు ఎంపిక చేసుకున్న భాష కాకుండా ఇతర భాషలో ప్రశ్నాపత్రం కేటాయించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఈ తప్పు తరువాత వారికి పరిహార మార్కులను ఇవ్వడాన్ని , తరువాత కమిటీ సలహా మేరకు ఎన్‌టిఎ వీరికి మరోసారి పరీక్షను నిర్వహించడాన్ని తప్పు పట్టింది. అలాగే ఫిజిక్స్‌లో ఒక ప్రశ్నకు రెండు సమాధానాలకు మార్కులు ఇవ్వాలని ఎన్‌టిఎ నిర్ణయించిన సంఘటనను తీర్పు ప్రస్తావించింది. తరువాత ఐఐటి (ఢిల్లీ) బృందం ఈ ప్రశ్నకు ఒక్క సమాధాన్నే గుర్తించింది. గ్రేస్ మార్కులపై ఎన్‌టిఎ తత్తరబిత్తర వ్యవహారం పై సుప్రీం ఘాటైన వ్యాఖ్యలు చేసింది. ఎన్‌టిఎ నిర్మాణ ప్రక్రియలో లోపాలు ఉన్నాయని, వాటిని సరిదిద్దాలని తెలిపింది. పరీక్షా కేంద్రాలు పూర్తిగా సిసిటివి నిఘా, సమయ పర్యవేక్షణ, కార్యకలాపాల రికార్డింగ్ ఆవశ్యకతను కోర్టు ముఖ్యంగా ప్రస్తావించింది. నీట్ అక్రమాలపై దాఖలైన 40 వేర్వేరు పిటీషన్ల విచారణలో సుప్రీంకోర్టు ఈ తీర్పు వెల్లడించింది.

## వయనాడ్ ప్రజల కోసం నేడు, రేపు విరాళాల వసూళ్లు

- సిపిఎం పిలుపు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనలో 300 మందికిపైగా మరణించారని, ఇటువంటి సమయంలో కేరళకు యావత్ భారత ప్రజానీకం అండగా నిలవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. సిపిఎం పొలిట్‌బ్యూరో పిలుపు మేరకు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన విరాళాలు సేకరించి బాధితులకు పంపాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆగస్టు 3, 4 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల వద్దకు వెళ్లి బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించాలని పార్టీ శాఖలను కోరారు. **సిపిఐఎం పీపుల్స్ రిలీఫ్ ఫండ్** అకౌంట్ నెంబరు **62109192143, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ఐఎఫ్‌ఎస్‌సి కోడ్ ఎస్‌బిఐఎన్ 0020343,** బీసెంట్ రోడ్ బ్రాంచి విజయవాడకు పంపాలని కోరారు. విరాళం పంపిన తరువాత సమాచారం కోసం 9490099018కు వాట్సాప్ లేదా రాష్ట్ర కమిటీ మెయిల్‌కు సమాచారం పంపాలని కోరారు.

• లోపలి పేజీలో..

### రూ.4.5 లక్షల కోట్ల సంపద ఆవిరి

- సెన్సెక్స్ 886 పాయింట్ల పతనం

### 'సాగర్' ఎడమ కాలువకు నీటి విడుదల

# సీడ్ బిజినెస్ డిస్ట్రిక్ట్ కోసం సింగపూర్‌తో చర్చలు

- సిఆర్‌డిఎ పరిధి పునరుద్ధరణ • 'అథారిటీ' సమావేశంలో కీలక నిర్ణయాలు
- యాన్యుటీ, పెన్షన్లు మరో ఐదేళ్లు పొడిగింపు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

సిఆర్‌డిఎ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

రాజధాని అమరావతిలో అత్యంత కీలకమైన సీడ్ బిజినెస్ డిస్ట్రిక్(సిబిడి) అభివృద్ధి కోసం సింగపూర్‌తో మరోసారి చర్చలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా సిఆర్‌డిఎ పరిధిని గతంలో మాదిరి పునరుద్ధరించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాడు నాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సిఆర్‌డిఎ) సమావేశంలో ఈ మేరకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. క్యాపిటల్ సిటీ పాత మాస్టర్‌ప్లానుకు అనుగుణంగా 217 చదరపు కిలోమీటర్ల పరిధికి, రీజియన్ పరిధిని 8352.69 చదరపు కిలోమీటర్లకు పునరుద్ధరించాలన్న ప్రతిపాదనను ఈ సమావేశం ఆమోదించింది. సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశానికి మంత్రి నారాయణ, అథారిటీ సభ్యులు హాజరయ్యారు. మొత్తం 12 అంశాల ఎజెండాతో ఈ సమావేశం జరిగింది. రాజధాని అభివృద్ధిలో కీలక పాత్ర పోషించనున్న సీడ్ బిజినెస్ డిస్ట్రిక్ ఏర్పాటుపై గతంలో స్విస్ ఛాలెంజ్ పద్ధతిలో సింగపూర్ ప్రభుత్వ ఆధ్వర్యాన కన్సార్టియం ముందుకు వచ్చింది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దాన్ని రద్దు చేయడంతోపాటు సింగపూర్ వెళ్లి ఒప్పందంపై విచారణ కూడా జరిపింది. దీంతో సింగపూర్ ప్రభుత్వం ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. దీనిని పునరుద్ధరించేందుకు మరోసారి సింగపూర్ ప్రభుత్వంతో చర్చలు జరపాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. గతంలో అమరావతి రాజధాని నగరం పరిధి నుండి 54 చదరపు కిలోమీటర్లను తొలగించి మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కలిపిన విషయం తెలిసిందే. తాజా సమావేశంలో ఆ విషయం కూడా చర్చకు వచ్చింది. ఆ ప్రాంతాన్ని తిరిగి రాజధాని నగర పరిధిలోకి తీసుకోవాలని నిర్ణయించారు. తొలగించిన పల్నాడు, బాపట్ల పట్టణాభివృద్ధి అథారిటీలను కూడా సిఆర్‌డిఎలో కలుపుతూ నిర్ణయం తీసుకున్నారు. రైతులకు ఒప్పందం ప్రకారం ఇవ్వాల్సిన యాన్యుటీ, భూమిలేని పేదలకు ఇస్తున్న పెన్షన్ల గడువు ఈ ఏడాదితో తీరిపోయింది. దీన్ని కూడా మరో ఐదేళ్లు కొనసాగించనున్నారు. ఆగస్టు 1వ తేదీ నాటికి ఎంత మొత్తం యాన్యూటీ చెల్లిస్తున్నారో అంతే మొత్తాన్ని మరో ఐదేళ్లపాటు కొనసాగించనున్నారు. పెన్షన్లనూ అదే పద్ధతిలో కొనసాగిస్తారు.

**778 పోస్టుల భర్తీకి ఆమోదం**

సిఆర్‌డిఎలో 778 పోస్టులకు అనుమతి ఉండగా ప్రస్తుతం 249 మంది మాత్రమే ఉన్నారు. మిగిలిన పోస్టులనూ భర్తీ చేయాలని నిర్ణయించారు. సిఆర్‌డిఎకు వేర్వేరు సేవలు అందించేందుకు 47 మంది కన్సల్టెంట్లు ఉండగా, వారిలో 15 మంది పని పూర్తయింది. దీంతో మరో 32 మందిని తీసుకోవాలని నిర్ణయించారు. కరకట్ట రోడ్డును నాలుగులైన్లుగా మార్చాలని నిర్ణయించారు. వాస్తవంగా 2019కు ముందే నాలుగులైన్లకు టెండర్లు వచ్చారు.

దాన్ని వైసిపి ప్రభుత్వం రెండు లైన్లకు కుదించింది. ప్రస్తుతం నాలుగులైన్లుగా మార్చి పాత జాతీయ రహదారికి అనుసంధానం చేయనున్నారు. 217 చదరపు కిలోమీటర్ల పరిధిలోని రోడ్ గ్రిడ్‌కు సంబంధించి ఇ5, ఇ11, ఇ13, ఇ15 రోడ్లను పాత జాతీయ రహదారికి కలపాలని నిర్ణయించారు. కొండలు అడ్డున్నచోట పక్కగా మిగతా 2లో

# రైతులకు పగటిపూటే ఉచిత విద్యుత్

## • విద్యుత్ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. విద్యుత్‌శాఖపై సచివాలయంలో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ దిశగా ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, యూనిట్ విద్యుత్ తయారీకి అవుతున్న వ్యయం, లోటును భర్తీ చేసేందుకు ఇతర గ్రిడ్ల నుంచి కొనుగోలు చేస్తున్న విద్యుత్ వ్యయం తదితర అంశాలపై సిఎం అధికారులతో చర్చించారు. అవసరాలకు అనుగుణంగా విద్యుత్‌ను అందించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ విధానంపై ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. రాష్ట్ర రైతాంగానికి పగటిపూటే 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. డిమాండ్‌కు తగ్గ విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, తక్కువ ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తి వంటి పరిస్థితులను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి కేంద్రప్రభుత్వం అందించే వివిధ రకాల సబ్సిడీలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. థర్మల్, జలవిద్యుత్, సోలార్, విండ్ వంటి విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులతో పాటు త్వరలో అందుబాటులోకి రానున్న విద్యుత్ ప్రాజెక్టుల పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి పరిస్థితులను ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్, సిఎం కార్యదర్శి ఎవి రాజమౌళి, జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధర్ బాబు, ట్రాన్స్‌కో సిఎమ్‌డి కీర్తి చేకూరి, ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి జె నివాస్, కెపిఎంజి ప్రతినిధి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**రేషన్ డీలర్లు, వాహనాల వినియోగంపై కసరత్తు**
**- ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సిఎం ఆదేశం**

రేషన్ డీలర్లను, డోర్ డెలివరీ వాహనాలను ఎలా ఉపయోగించుకోవాలనే అంశాలపై పలు ప్రతిపాదనలతో రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. అధికారులను ఆదేశించారు. పౌరసరఫరాల శాఖపై సచివాలయంలో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం ధాన్యం సేకరణ విధానాన్ని అస్తవ్యస్తం చేసి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ఇటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. 2019 వరకు సివిల్ సప్లైశాఖ అప్పులు రూ.21,622 కోట్లుగా ఉంటే ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ హయాంలో రూ.41,550 కోట్లకు తీసుకెళ్లి శాఖను నాశనం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణపై దృష్టిపెట్టాలని ఆదేశించారు. వ్యవసాయ, సివిల్ సప్లై, మార్కెటింగ్ శాఖల సమన్వయంతో పనిచేస్తే ధరల నియంత్రణ సాధ్యమవుతుందని చెప్పారు. ప్రస్తుతం సివిల్ సప్లైశాఖ ద్వారా 2,372 కౌంటర్లు ఏర్పాటు చేసి మార్కెట్ కంటే తక్కువ ధరకే కందిపప్పు, బియ్యం విక్రయిస్తున్నట్లు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. మరిన్ని సరుకులు రేషన్ షాపుల్లో తక్కువ ధరకు అమ్మాలని సిఎం సూచించారు.


పౌరసరఫరాల అధికారుల సమీక్షలో సిఎం చంద్రబాబు

**అంగన్‌వాడీ కేంద్రాల్లో సదుపాయాలు**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిసారించాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులను సిఎం ఆదేశించారు. ఆ శాఖ అధికారులతో కలిసి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో వీలైనన్ని మహిళా హాస్టళ్లు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ శాఖలో ఏడాదిలోనే మంచి ఫలితాలు సాధించే లక్ష్యంతో ప్రణాళిక ప్రకారం పనిచేయాలని సూచించారు. కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తిలో విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నేతలు

## వరద బాధితులకు సిపిఎం విరాళాల సేకరణ

**ప్రజాశక్తి - యంత్రాంగం**

కేరళ రాష్ట్రం వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడి విలయం సృష్టించిన ఘటనలో బాధిత కుటుంబాలకు సంఘీభావం, సహాయక చర్యలకు మద్దతుగా సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం విరాళాలు సేకరించారు. భీమిలిలో దాతల నుంచి రూ.5,517 విరాళాలు సేకరించారు. దాతలకు సిపిఎం జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వి.నాగరాజు, ఎస్.అప్పలనాయుడు పాల్గొన్నారు. జివిఎంసి 96వ వార్డు పరిధి పెందుర్తిలో సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి, సిఐటియు నాయకులు శంకరరావు, అప్పలనాయుడు ఆధ్వర్యాన విరాళాలు సేకరించారు. బాధిత కుటుంబాలకు భరోసాగా సిపిఎం చేపట్టిన విరాళాల సేకరణలో పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రూ.5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా రమణి మాట్లాడుతూ.. కేరళ బాధితులను అన్ని విధాలుగా ఆదుకుని, ఆ రాష్ట్రానికి అండగా నిలవాల్సిన కేంద్ర ప్రభుత్వం విపత్తు సమయంలో విమర్శలు చేయడం విచారకరమన్నారు. పాత గాజువాక నుంచి కొత్తగాజువాక వరకు దుకాణదారులు, ప్రజలు స్పందించి రూ.7,100 విరాళాలు అందించారు. సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, కిరీటం, లోకేష్, సత్యనారాయణ, వెంకటరావు పాల్గొన్నారు. విశాఖలోని పూర్ణా మార్కెట్ ప్రాంతంలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రూ.14,565 విరాళాలు ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.సుబ్బారావు, వై.రాజు, కెవిపి చంద్రమౌళి పాల్గొన్నారు.

## 2029 ఎన్నికలే లక్ష్యంగా ముందుకు

### • ఎన్ఆర్ఐ టిడిపి ప్రతినిధులతో మంత్రి అనగాని

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఎన్ఆర్ఐ టిడిపి ప్రతినిధులు 2029 ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలని రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో టిడిపి కూటమి విజయానికి కీలకంగా పనిచేశారని తెలిపారు. సచివాలయంలో మంత్రి అనగానితో శుక్రవారం వారు భేటీ అయ్యారు. ఎన్ఆర్ఐ టిడిపి సభ్యుల సేవలు ఎప్పటికీ మరవబోమని మంత్రి అనగాని అన్నారు. మంత్రిని కలిసిన వారిలో ప్రతినిధులు కిరణ్ తుమ్మల, సూర్యతెలప్రోలు, మురళి కోగంటి, తేజ్ మన్నవ, వల్లభనేని నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

**గన్నవరం నుంచి విమాన సర్వీసులు పెంచాలి : రాకేష్**

గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి దేశ, విదేశీ విమాన సర్వీసులు పెంచాలని తెలుగు వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు డూండీ రాకేష్ కోరారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును ఢిల్లీలో కలిసి వినతిపత్రం అందజేశారు. విజయవాడ నుంచి వయా విశాఖపట్నం మీదుగా వారణాసికి సర్వీస్ ప్రారంభించాలని కోరారు. కోల్‌కతా, అహ్మదాబాద్, బెంగళూర్, పూణె, ముంబయి, దుబాయ్‌కు సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరారు.

**దారికొచ్చిన ఎస్‌సి వర్గీకరణ సమస్య : అఖిల్**

ఎస్‌సి వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలదేనంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో సమస్య ఒక దారికొచ్చిందని టిడిపి ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు కోడూరి అఖిల్ తెలిపారు. ఎస్‌సి వర్గీకరణ పోరాటానికి తొలి నుంచి తమ పార్టీ అధినేత చంద్రబాబు అండగా నిలిచారని వెల్లడించారు.

## అక్టోబరు 1 నుంచి కొత్త ఎక్సైజ్ పాలసీ

### • అధ్యయనం కోసం 6 రాష్ట్రాలకు 4 కమిటీలు
### • గత ప్రభుత్వ అక్రమాలపై సిఐడి దర్యాప్తు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరు ఒకటి నుంచి నూతన మద్యం విధానాన్ని తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తోంది. గత ప్రభుత్వం నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలను తీసిందని, తమ ప్రభుత్వం వస్తే నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరకే అందిస్తామని తెలుగుదేశం కూటమి ఎన్నికలకు ముందు చేసిన వాగ్దానం మేరకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఎక్సైజ్ పాలసీని పకడ్బందీగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, అధికారులతో కసరత్తు చేశారు. గత ఐదేళ్లలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణకు ఇప్పటికే సిఐడిని ఆదేశించామని సిఎం చంద్రబాబు ఈ సందర్భంగా తెలియజేశారు. ఏవైనా ఆధారాలు దొరికితే సిఐడికి నివేదించాలని ఆదేశించారు. కొత్త విధానం రూపకల్పనకు దేశంలోని ఆరు రాష్ట్రాల్లో అధ్యయనం చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం అధికారులతో కూడిన నాలుగు కమిటీలను ఏర్పాటు చేశారు. ఒక్కో కమిటీలో ముగ్గురు చొప్పున సీనియర్ అధికారులు ఉండనున్నారు. రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక-తెలంగాణ, తమిళనాడు-కేరళ రాష్ట్రాలకు ఈ నాలుగు కమిటీలు వెళ్లనున్నాయి. ఆయా రాష్ట్రాల్లోని ఎక్సైజ్ పాలసీ, మద్యం షాపుల నిర్వహణ, బార్ల అనుమతులు, ధరలు, మద్యం కొనుగోళ్లు, నాణ్యత, చెల్లింపుల విధానం, డిజిటల్ పేమెంట్ తదితర అంశాలపై ఈ కమిటీలు అధ్యయనం చేయనున్నాయి. ట్రాక్ అండ్ ట్రేస్, డీ అడిక్షన్ సెంటర్ల నిర్వహణ వంటి అంశాలపైనా పరిశీలన చేయనున్నారు. ఆయా రాష్ట్రాల్లోని అత్యుత్తమ విధానాలపై నాలుగు కమిటీలు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నాయి. ఈ నెల 12లోగా అధ్యయన నివేదికలు సమర్పించాలని కమిటీలకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

## రాజమండ్రి వైసిపి ఆఫీసు కూల్చొద్దు : హైకోర్టు

**ప్రజాశక్తి-అమరావతి**

రాజమహేంద్రవరంలో వైసిపి ఆఫీసు కూల్చివేతకు మున్సిపల్ అధికారులు ఇచ్చిన తుది ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. భవన నిర్మాణ అనుమతుల రెన్యువల్‌కు అధికారులకు దరఖాస్తు ఇచ్చేందుకు వైసిపికి వెసులుబాటు ఇచ్చింది. ఆ దరఖాస్తుపై తుది నిర్ణయం తీసుకునే వరకు కూల్చివేత ఉత్తర్వులను అమలు చేయరాదని జస్టిస్ బి కృష్ణమోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సమయంలో తదుపరి నిర్మాణాలేవీ చేపట్టొద్దని పార్టీని ఆదేశించారు. మున్సిపల్ అధికారుల ఉత్తర్వులను రద్దు చేయాలంటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా వేసిన వ్యాజ్యాలపై విచారణ చేశాక కూల్చివేత చర్యలకు పాల్పడొద్దని ఉత్తర్వులు జారీ చేశారు.

## సీడ్ బిజినెస్ డిస్ట్రిక్ట్ కోసం సింగపూర్‌తో చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకెళ్లాలని నిర్ణయించారు. గతంలో ఎర్రబాలెం వద్ద కొండకు టన్నెల్ వేయాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం పక్కనుండి రోడ్లు వేయనున్నారు.

**కృష్ణానదిపై ఏడు వంతెనలు**

కృష్ణానదిపై ఏడుచోట్ల వంతెనాలు వస్తాయని, వాటిని ఐకానిక్ వంతెనలుగా మార్చాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీ, కనకదుర్గ వారధి, సూరాయపాలెం వద్ద పశ్చిమబైపాస్ వంతెన ఉన్నాయి. వీటికి అదనంగా అవుటర్, ఇన్నర్ రింగురోడ్లకు విజయవాడకు పశ్చిమ భాగంలో రెండు, తూర్పుభాగంలో రెండు నిర్మించనున్నారు. గతంలో ఇబ్రహీంపట్నం వద్ద నిర్మించాలని ప్రతిపాదించిన వంతెన నిర్మాణంపై పునరాలోచించనున్నారు.

**130 సంస్థలతో సంప్రదింపులు**

గతంలో అమరావతి పరిధిలో 130 సంస్థలకు స్థలాలు ఇచ్చారు. వారితో సంప్రదింపులు జరపాలని నిర్ణయించారు. ఇప్పటికే భూములు పొందిన వారికి ప్రభుత్వం వైపు నుండి లేఖలు పంపించారు. తొలి విడత సిఆర్‌డిఎ కమిషనర్ భాస్కర్ పలువురితో సంప్రదింపులూ జరిపారు. రెండో విడతలో మంత్రి నారాయణ చర్చలు జరపున్నారు. ఈమేరకు అథారిటీలో నిర్ణయం తీసుకున్నారు. బిట్స్ పిలానీ లాంటి సంస్థలనూ పిలిచి మాట్లాడనున్నారు. దీంతోపాటు హ్యాపినెస్ట్ ప్రాజెక్టుపైనా త్వరలో ఒక నిర్ణయం తీసుకోనున్నారు. ఈమేరకు సిఎం అధికారులను ఆదేశించారు.

**ఎంఐజి, ఎల్ఐజి ఇళ్లు**

రాజధాని పరిధిలో ఎంఐజి, ఎల్ఐజి పద్ధతిలో ఇళ్లు నిర్మించనున్నారు. దీనికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సిఎం అథారిటీకి సూచించారు. ఇప్పటికే పేదలకు ఇళ్లు నిర్మించిన నేపథ్యంలో ఈ ప్రాజెక్టు ద్వారా కొంత జన సామర్థ్యం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

## కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులరైజేషన్‌కు చర్యలు

### • మంత్రి కేశవ్‌కు పిడిఎఫ్ వినతి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులరైజేషన్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం రెగ్యులరైజేషన్ చట్టం చేసి జిఓ 114 విడుదల చేసిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖల్లో 10,117 మందిని రెగ్యులరైజేషన్ చేయటానికి అనుమతించారని వివరించారు. ఇప్పటికీ 3 వేల మందిని మాత్రమే రెగ్యులరైజ్ చేశారని, వీరిలో ఎక్కువగా వైద్యారోగ్య విభాగంలో పనిచేశారని పేర్కొన్నారు. విద్యారంగంలో సుమారు 5 వేల మందిని రెగ్యులరైజ్ చేయాల్సి ఉందని తెలిపారు. కాంట్రాక్టు అధ్యాపకుల రెన్యువల్ ఫైల్‌ను ఆమోదించాలని కోరారు. సాంఘిక సంక్షేమ, బిసి సంక్షేమ, ఎపి రెసిడెన్షియల్, గిరిజన సంక్షేమ గురుకులాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని కోరారు.

## విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్స

### • వైసిపి నిర్ణయం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఈ నెల 30న జరగనున్న విశాఖపట్నం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలోకి వైసిపి సీనియర్ నేత మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను ఆ పార్టీ రంగంలోకి దింపింది. ఈ మేరకు వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాన్ని ప్రకటించారు. శుక్రవారం తాడేపల్లిలోని తన నివాసంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నేతలతో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ అధికారపార్టీ కుట్రలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో మొత్తం 841 మందికి ఓటుహక్కు ఉండగా, వైసిపికి 615 మంది, టిడిపి కూటమికి 215 మంది సభ్యుల బలం అధికారికంగా ఉంది.

## 'పింగళి' దేశ సేవను స్మరించుకుందాం

### • నివాళులర్పించిన చంద్రబాబు, పవన్ కల్యాణ్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య దేశ సేవను స్మరించుకుందామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పతాక రూపకర్తగా భారతజాతి చేతికి ఒక ఆత్మగౌరవ ప్రతీకను అందించారని పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా శుక్రవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పొందుపరిచారు. తెలుగువారి దేశభక్తి, సంకల్పశక్తి ఎలా ఉంటాయో నిరూపించి తెలుగుజాతికి ఎనలేని గౌరవాన్ని తెచ్చిపెట్టారని తెలిపారు. ప్రతి ఒక్కరూ గర్వించే, నిత్యం స్ఫూర్తిని చాటే మువ్వన్నెల జెండాను రూపొందించిన ఆ మహనీయుని దేశ సేవను స్మరించుకుందామని అన్నారు.

పింగళి అందించిన స్ఫూర్తిని జాతి మరువదని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ జెండాకు సెల్యూట్ చేసిన ప్రతిసారీ వెంకయ్య స్ఫురణకు వస్తూనే ఉంటారని అన్నారు. వెంకయ్య స్వాతంత్ర్య సమరయోధుడు అని హోంమంత్రి వంగలపూడి అనిత, బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత, గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

## 3లక్షల హెక్టార్లలో బిందు సేద్యం

### • వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో ఈ ఏడాది 3లక్షల హెక్టార్లలో బిందు సేద్యం సాగు అమలు చేసేందుకు లక్ష్యం నిర్దేశించినట్లు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. తద్వారా రాష్ట్రరైతాంగానికి ప్రత్యక్షంగా పరోక్షంగా రూ.3,450కోట్లు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. రైతులకు తక్షణమే బిందు సేద్యం పరికరాలను రాయితీపై అందించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఇప్పటి నుంచే రిజిస్ట్రేషన్లు ప్రారంభించాలని చెప్పారు. బిందు సేద్యం అమలుపై సచివాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో రాష్ట్రంలో బిందు సేద్యం నిర్వీర్యమయ్యిందని విమర్శించారు. నాబార్డు ద్వారా అందించే బిందుసేద్యం ఫండ్ (మైక్రోఇరిగేషన్ ఫండ్)ను కూడా సద్వినియోగం చేసుకోలేదన్నారు. రైతుల పట్ల తీవ్ర కక్షపూరిత ధోరణి అవలంభించిందని, బిందు సేద్యానికి రూ.1,167కోట్ల బకాయిలు పెట్టిందన్నారు. బిందు సేద్యం అమలు చేయాలనే సంకల్పంతో కంపెనీలకు బకాయిలను వాయిదా పద్ధతిలో చెల్లిస్తున్నామని చెప్పారు. గత చంద్రబాబు హయాంలో 17.6శాతం భాగస్వామ్యంతో బిందు సేద్యం అమలులో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందన్నారు. జగన్ పాలనలో ఇది 5.7శాతానికి వచ్చిందన్నారు. ఉద్యానసాగులో 55శాతమే ఈ సేద్యం అమలవుతుందని, నూరుశాతం అమలు చేసేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఉద్యాన, మత్స్యశాఖల కార్యదర్శి అహ్మద్ బాబు, ఉద్యానశాఖ డైరెక్టర్ కె శ్రీనివాసులు, ఎపిఎంఐడిపి ప్రాజెక్టు అధికారి బి హరనాథరెడి తదితరులు పాల్గొన్నారు.

## సైకో పైశాచికం

**బాలికను కొట్టి చంపిన పెదనాన్న**

**ప్రజాశక్తి- హిందూపురం (శ్రీ సత్యసాయి జిల్లా)**

శ్రీ సత్యసాయి జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. అభం శుభం ఎరుగని చిన్నారిని వరుసకు పెదనాన్న అయ్యే వ్యక్తి, సైకో అతిదారుణంగా కొట్టి చంపేసి పెన్నా నది ఇసుక మేటల్లో పూడ్చి పెట్టాడు. దీనికి ముందు బాలికపై అత్యాచారం చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. శుక్రవారం వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... హిందూపురం రూరల్ మండలం తూముకుంటకు చెందిన మంజులకు, పరిగి మండలం బీచగానిపల్లికి చెందిన నాగేంద్రకు గతంలో వివాహమైంది. ప్రస్తుతం వారికి కుమార్తె అనిత (8) ఉంది. రెండో కాన్పు నిమిత్తం మూడు రోజుల క్రితం కూతురుతో కలిసి తూముకుంటలోని తన అక్క రత్నమ్మ ఇంటికి మంజుల వచ్చింది. రత్నమ్మ భర్త గంగాధర్ శుక్రవారం ఉదయం అనితకు మాయమాటలు చెప్పి గ్రామ సమీపంలోని పెన్నా నది వద్దకు తీసుకెళ్లి చిన్నారిని గొంతు నులుమి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని పెన్నా నది ఇసుక మేటల్లో పూడ్చి పెట్టి ఏమీ తెలియని వాడిలా ఇంటికి వచ్చేశాడు. చిన్నారితో కలిసి వెళ్లిన వ్యక్తి ఒక్కడే ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు పాప కోసం గంగాధర్‌ను ప్రశ్నించారు. సరైన సమాధానం చెప్పకపోవడంతో అనుమానం వచ్చి హిందూపురం రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్లో చిన్నారి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. గంగాధర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించడంతో చిన్నారిని హత్య చేసి, ఇసుక మేటల్లో పూడ్చినట్లు ఒప్పుకు న్నాడు. అడిషనల్ ఎస్‌పి విష్ణు, సిఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో చిన్నారి మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అనిత (ఫైల్)

నిందితుడు గంగాధర్ (ఫైల్)

**అత్యాచారం చేసి హత్య చేసినట్లు అనుమానం?**

బాలికపై గంగాధర్ అత్యాచారం చేసి ఆపై హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అత్యాచారం చేసి హత్య చేశాడా? లేక తన సైకో చేష్టలతో హత్య చేశాడా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని అడిషనల్ ఎస్‌పి విష్ణు తెలిపారు. నిందితుడు గంగాధర్ గత పదేళ్ల కాలంలో ఇద్దరు మహిళలను ఇదే తరహాలో హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. నాగరత్నమ్మ అనే 70 ఏళ్ల వృద్ధురాలిని బండరాళ్లతో కొట్టి చంపేసినట్లు గతంలో కేసు నమోదైంది. హనుమక్క అనే మహిళను రాత్రి సమయంలో మాయమాటలు చెప్పి చెరువు వద్దకు తీసుకెళ్లి అత్యాచారం చేసి అనంతరం దారుణంగా కొట్టి హత్య చేసినట్లు మరో కేసు ఉంది.

## 'రాజధాని'లో ఐఐటి నిపుణుల బృందం

### భవనాల పటిష్టతపై ప్రభుత్వానికి నివేదిక!

**ప్రజాశక్తి- తుళ్లూరు (గుంటూరు జిల్లా)**

రాజధాని అమరావతిలోని భవనాలను హైదరాబాద్ ఐఐటి నిపుణుల బృందం శుక్రవారం పరిశీలించింది. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఐఎఎస్, ఐపిఎస్ భవన సముదాయాల ప్రస్తుత స్థితిగతులు, వాటి సామర్థ్యం, పటిష్టత, నీటి నిల్వ ప్రభావం ఏ మేరకు ఉంటుందనే అంశాలపై పరిశీలన జరిపింది. ఈ సందర్భంగా బృందంలోని ఐఐటి ప్రొఫెసర్లు సుబ్రహ్మణ్యం, మున్వర్ బాషా మాట్లాడుతూ భవనాలు, ఇతర నిర్మాణాలకు సంబంధించిన సాంకేతికపరమైన అంశాలను పూర్తిగా పరిశీలించాక ప్రభుత్వం, సిఆర్‌డిఎ అధికారులకు నివేదిక అందజేస్తామని, దీనికి నిర్దిష్టమైన గడువు లేదని తెలిపారు. రాజధానిలో 2019కు ముందు నిర్మాణాలు ప్రారంభమై మధ్యలోనే నిలిచిపోయిన భవనాలు కొన్ని ఉండగా, మరికొన్ని పునాదుల పనుల తర్వాత అసంపూర్తిగా మిగిలిపోయాయి.

రహదారులను పరిశీలిస్తున్న నిపుణుల బందం

అలాంటి నిర్మాణాల విషయంలో ఎలా ముందుకెళ్లాలనే దానిపై ఐఐటి ఇంజనీర్లతో రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం చేయిస్తోంది. సెక్రటేరియట్, హెచ్‌ఒడిఒ కార్యాలయాలతో పాటు హైకోర్టు భవనాన్ని ఐకానిక్ కట్టడాలుగా నిర్మించేలా నాటి టిడిపి ప్రభుత్వం పనులు మొదలు పెట్టింది. దీనికోసం భారీ ఫౌండేషన్లతో పునాదులు వేసింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోలేదు. పైగా, మూడు రాజధానులను ఏర్పాటు చేస్తానని ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు టిడిపి కూటమి అధికారంలోకి రావడం, అమరావతి నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వడంతో ఈ భవనాల ఫౌండేషన్ సామర్థ్యాన్ని పరిశీలించే బాధ్యతను ఐఐటి మద్రాస్, హైదరాబాద్ నిపుణుల బృందానికి అప్పగించింది. మద్రాస్ ఐఐటి బృందం కూడా ఈ భవనాలను, ఇతర నిర్మాణాలను పరిశీలించనుంది.

**నేడూ పరిశీలన**

నేలపాడు మధ్యగల శాశ్వత హైకోర్టు, సచివాలయం నిర్మాణ ప్రాంతాన్ని మద్రాస్, హైదరాబాద్ ఐఐటి బృందాలు శనివారం పరిశీలన చేయనున్నాయి. నీటిలో ఉన్న నిర్మాణాల పరిశీలనకు ట్రయిల్ రన్ నిర్వహించనున్నాయి. సెక్రటేరియట్, హైకోర్టు పునాదులను పరిశీలించి నివేదిక ఇవ్వనున్నాయి.

## రాజకీయ కక్షే.. : వైసిపి

**ప్రజాశక్తి-అమరావతి**

టిడిపి ఆఫీసుపై దాడి చేశారనే ఫిర్యాదులో తమ పేర్లు లేవని, రాజకీయ కక్షతో తమను కేసులో ఇరికించారని వైసిపి నేతలు హైకోర్టుకు నివేదించారు. వైసిపి ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, మాజీ ఎంపి నందిగం సురేష్, విజయవాడ నేత దేవినేని అవినాష్ ఇతరులు తరపున న్యాయవాదులు వాదించారు. పిటిషనర్లు దాడి చేసినట్లు ఫిర్యాదుదారే చెప్పడం లేదన్నారు. మూడేళ్ల తర్వాత కేసులో కొత్త పేర్లను పోలీసులు ఇరికిస్తున్నారని చెప్పారు. టిడిపి ఆఫీసుపై దాడి కేసులో తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని పిటిషన్లపై తదుపరి విచారణను ఈ నెల ఐదుకు వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ వక్కలగడ్డ కృపాసాగర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## భద్రత కుదింపు అన్యాయం

ప్రాణహాని ఉన్నందున తన భద్రతను 1ప్లస్1 నుంచి 3ప్లస్3కి పెంపు చేసేలా ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేయాలంటూ తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిని జస్టిస్ బి కృష్ణమోహన్ శుక్రవారం విచారణ జరిపి పోలీసులు కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేశారు. విచారణను ఈ నెల 7కు వాయిదా వేశారు. ఎమ్మెల్యేకు భద్రత కుదింపు అన్యాయమని, గతంలోని భద్రత కొనసాగించాలని ఎస్‌పికి వినతిపత్రం ఇచ్చినా చర్యలు లేవని పిటిషనర్ తరపున న్యాయవాది తెలిపారు.

## మదనపల్లె మున్సిపల్ వైస్ చైర్మన్‌పై కేసు

**ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్**

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డుల దహనం కేసులో మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటా చలపతిపై సిఐడి అధికారులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషాపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై 52 మందిని విచారించగా ఎనిమిది మందిపై కేసులు నమోదు చేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అనుచరుడిగా జింకా వెంకటాచలపతి ఉన్నారు. ఎప్పుడు ఏమి జరుగుతుందో నన్న సందిగ్ధంలో పలువురు వైసిపి నేతలు పరారీలో ఉన్నారు.

జింకా వెంకటాచలపతి

## ఉద్యోగుల్లో అభద్రతా భావాన్ని పెంచొద్దు

### • ప్రభుత్వ మాజీ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

కొత్తగా ఏర్పడిన టిడిపి కూటమి ప్రభుత్వం తమకు ఎన్నికల్లో సహకరించలేదనే కారణంతో ఉద్యోగులను అభద్రతా భావానికి గురిచేయడం తగదని ఎపిఎన్‌జిఒ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, ప్రభుత్వ మాజీ సలహాదారు ఎన్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ప్రభుత్వం వచ్చాక 2.5 లక్షల మంది వలంటీర్లను పక్కన పెట్టేసిందన్నారు. వారిని ఎందుకు పక్కన పెట్టారో చెప్పాలన్నారు. అలాగే ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై రాజకీయ వేధింపులను ఆపాలన్నారు.

## మిద్దె కూలి నలుగురు మృతి

### • నంద్యాల జిల్లాలో తీవ్ర విషాదం

**ప్రజాశక్తి- చాగలమర్రి**

నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చిన్నవంగలి గ్రామంలో మట్టి మిద్దె కూలడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. దీంతో, గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానికుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన గురుశేఖర్‌రెడ్డి (45), దస్తగిరమ్మ (38), వారి కుమార్తెలు పవిత్ర (16), గురులక్ష్మి (10) ఎప్పటిగానే తమ మిద్దె ఇంట్లో గురువారం రాత్రి నిద్రించారు. ఆ ఇల్లు బాగా పాతది కావడంతో అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా మిద్దె కూలిపోయింది. ఆ సమయంలో గాఢనిద్రలో ఉన్న ఆ నలుగురిపై శిథిలాలు పడ్డాయి. శుక్రవారం తెల్లవారుజామున ఈ విషయాన్ని గమనించిన స్థానికులు శిథిలాలను తొలగించి చూడగా అప్పటికే నలుగురూ విగతజీవులుగా ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడం అందరినీ కలచివేసింది. ఆ కుటుంబంలో మొత్తం ఐదుగురు సభ్యులున్నారు. గురుశేఖర్‌రెడ్డి, దస్తగిరమ్మ దంపతుల రెండో కుమార్తె ప్రసన్న కడప జిల్లా ప్రొద్దుటూరు ఉషోదయ పాఠశాలలో పదో తరగతి చదువుతూ అక్కడే ఉంటోంది. దీంతో, ఆమె సురక్షితంగా ఉన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి పరిహారం అందించేందుకు కృషి చేస్తానని, ప్రసన్న ఉన్నత చదువు పూర్తి బాధ్యత తాను తీసుకుంటానని నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి హామీ ఇచ్చారు.

తల్లిదండ్రులను, అక్కచెల్లెళ్లను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ప్రసన్న

**రూ.5 లక్షల పరిహారం అందిస్తాం : భూమా అఖిలప్రియ**

ఈ ఘటనపై ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి ఎల్లవేళలా తాము అండగా ఉంటామన్నారు.

## 50 రోజుల్లో 10 వేలకు పైగా అర్జీలు

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా, మంత్రి గొట్టిపాటి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

తమ పార్టీ కార్యాలయంలో 50 రోజులుగా నిర్వహిస్తున్న ప్రజావేదిక గ్రీవెన్స్ కార్యక్రమంలో తమకు 10 వేలకు పైగా ప్రజల నుంచి అర్జీలు అందాయని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ప్రతి అర్జీని సంబంధిత శాఖలకు, ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలకు పంపి వాటిని పరిష్కరించి అర్జీదారులకు తెలియజేస్తున్నామని చెప్పారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఉదయం పల్లా, మధ్యాహ్నం గొట్టిపాటి విడివిడిగా గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. న్యాయం చేస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చి పట్టించుకోలేదని అగ్రిగోల్డ్ బాధితులు వినతిపత్రం అందజేశారు. నెల్లూరు సర్కిల్‌లో ఆత్మకూరు 220కెవి, రాచర్లపాడు 220కెవి, వింజమూరు 132 కెవి సబ్‌స్టేషన్లలో తొలగించిన తమను విధుల్లోకి చేర్చుకోవాలని మంత్రి గొట్టిపాటిని విద్యుత్ కార్మికులు కోరారు.

కరస్పాండెంట్ ఆంజనేయులను తీసుకెళ్తున్న పోలీసులు

## బాలికపై లైంగిక వేధింపులు

- స్కూల్ కరస్పాండెంట్‌పై కేసు

**ప్రజాశక్తి -అనంతపురం క్రైం**

అనంతపురం జిల్లా కేంద్రంలో ఓ ప్రయివేటు కళాశాల కరస్పాండెంట్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన శుక్రవారం నాడు వెలుగు చూసింది. ఈ ఘటన నగరంలో తీవ్ర సంచలనం రేపింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... అనంతపురం నగరం ఆదిమూర్తి నగర్‌లో లిటిల్ ఫ్లవర్ ప్రయివేటు స్కూల్‌లో నాలుగవ తరగతి చదువుతున్న విద్యార్థిని పట్ల కరస్పాండెంట్ ఆంజనేయులు గౌడ్ అసభ్యంగా ప్రవర్తించాడని బాలిక పిన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికను చూడడానికి వచ్చిన తన పిన్ని వద్ద కరస్పాండెంట్ తనను లైంగికంగా వేధిస్తున్నాడని చిన్నారి చెప్పింది. దీంతో ఆమె టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని ఆంజనేయులు గౌడ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. బాలికనూ విచారించారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. కరస్పాండెంట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా ఈ ఘటనపై కరస్పాండెంట్ కుమారుడు మీడియాతో మాట్లాడుతూ సుమారు 80 ఏళ్ళున్న తమ తండ్రి ఇన్నేళ్ల విద్యా చరిత్రలో ఎలాంటి మచ్చా లేదని అన్నారు. ఇటీవలి కాలంలో కొందరు తమ విద్యా సంస్థను అమ్మాలని డిమాండ్ చేశారని, అందుకు ఒప్పుకోకపోవడంతోనే ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై డిఎస్‌పి ప్రతాప్‌ను వివరణ కోరగా కేసు నమోదు చేశామని, అన్ని కోణాల్లో విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## అక్టోబర్ 4 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- లడ్డు నాణ్యత, రుచిని పెంచుతాం
- 'కాల్ యువర్ ఇఒ'లో శ్యామలరావు వెల్లడి

**ప్రజాశక్తి - తిరుమల**

అక్టోబర్ నాలుగు నుంచి 12 వరకు శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు టిటిడి ఇఒ జె.శ్యామలరావు వెల్లడించారు. శ్రీవారి లడ్డు నాణ్యతను, రుచిని మరింత పెంచుతామన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఇఒ కార్యక్రమం జరిగింది. అనంతరం మీడియాతో ఇఒ మాట్లాడుతూ.. అక్టోబర్‌లో జరగనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఆగస్టు 15-17 తేదీల్లో శ్రీవారి పవిత్రోత్సవాలు, 14న అంకురార్పణతో ప్రారంభమవుతాయని చెప్పారు. ఆగస్టు 1 నుంచి పుష్కరిణిని మూసివేసి పైపులైన్ల మరమ్మతులు, సివిల్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. శ్రీవారి యాత్రికుల సౌకర్యార్థం జులై 22 నుంచి ఆఫ్‌లైన్‌లో రోజుకు వెయ్యి శ్రీవాణి దర్శనం టికెట్లు కేటాయించనున్నట్లు చెప్పారు. తిరుమలలో తాగునీరు, అన్నప్రసాదాలు, ముడిసరుకులను ఎప్పటికప్పుడు పరిక్షించేందుకు ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ ఆధ్వర్యంలో అత్యాధునిక ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్యూలైన్లలో నిరంతరాయంగా అన్నప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తిరుమలలో దళారుల ఏరివేతకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. టిటిడి ఐటి వ్యవస్థను మరింత బలోపేతం చేసి ఆర్జిత సేవలు, దర్శనం, వసతి తదితర సేవల బుకింగ్‌లో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. గతంలో వారానికి 1.05 లక్షలు ఇస్తున్న ఎస్‌ఎస్‌డి టోకెన్లను ప్రస్తుతం 1.47 లక్షలకు పెంచామని, మరికొన్ని టోకెన్లను పెంచేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఇఒలు గౌతమి, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ కోరల్లో వ్యవసాయం

## పరిరక్షణ కోసం 9న మండల కేంద్రాల్లో నిరసనలు

- ఎస్‌కెఎం రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు

రైతు సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కబంధ హస్తాల నుంచి కాపాడుకునేందుకు క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో రైతులు పెద్దయెత్తున పోరాటాలకు సమాయత్తం కావాలని ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగాన్ని పరిరక్షించుకునేందుకు ఈ నెల 9న అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో రైతాంగం నిరసన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 9న క్విట్ ఇండియా రోజున బడా కార్పొరేట్ కంపెనీలను బహిష్కరించండనే నినాదంతో నిరసన కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని కోరారు. దేశ వ్యాప్తంగా ఎస్‌కెఎం పిలుపులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం బడా కార్పొరేట్ కంపెనీలకు రాయితీలను, రుణాలను మంజూరు చేసి వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. వ్యవసాయ రంగంలో రైతులకు రుణ విమోచన చట్టం, విత్తన చట్టం వంటి స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని అడిగితే కనీసం స్పందించడం లేదన్నారు. వ్యవసాయ ఉత్పత్తులను పది రెట్లు ఎక్కువగా అమ్ముతున్న బడా కార్పొరేట్ కంపెనీలకు మాత్రం పెద్దయెత్తున రాయితీలను అందిస్తున్నారని తెలిపారు. దేశానికి అన్నం పెట్టే రైతుకు మాత్రం నోట్లో మట్టి కొడుతున్నారని విమర్శించారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించే బడా కంనీలు, పంట ఉత్పత్తుల మార్కెటింగ్‌లోని కార్పొరేట్ కంపెనీలను దేశంలో నిషేధించాలని డిమాండ్ చేశారు. 9న చేపట్టనున్న నిరసన కార్యక్రమాలకు రైతులు, వ్యవసాయ కూలీలు పెద్దయెత్తున పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర నాయకులు వై కేశవరావు, కెవివి ప్రసాద్, మారపు సూర్యనారాయణ, కొల్లా రాజమోహన్, ఎం వెంకటరెడ్డి, లంక కృష్ణమూర్తి, మన్నవ హరిప్రసాద్, మరీదు ప్రసాద్ బాబు, కాలువ శ్రీధర్, జొన్నలగడ్డ నాగేశ్వరరావు, ఆంజనేయులు, కాసాని గణేష్‌బాబు, కొప్పుల విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత విద్యకు ప్రభుత్వ తోడ్పాటు అవసరం

- విట్ స్నాతకోత్సవంలో ఫౌండర్ జి.విశ్వనాథన్

**ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)**

భారతదేశంలో గొప్ప మానవ వనరులు ఉన్నాయని, ఉన్నత విద్యతో మానవ వనరులు అభివృద్ధి చెందితే యువత ప్రపంచంలో మంచి స్థానాన్ని సంపాదించడానికి వీలు కలుగుతుందని వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్) వ్యవస్థాపక ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్ తెలిపారు. తిరుపతిలోని విట్ క్రీడా ప్రాంగణంలో 39వ స్నాతకోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ 2047కి భారత్ అడ్వాన్స్‌డ్ కంట్రీగా ప్రపంచంలో గుర్తింపు సాధిస్తుందన్నారని, విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యనభ్యసించే వారికి తగిన సహకారం అందించకుండా ఎలా అడ్వాన్స్‌డ్ కంట్రీగా మారుతుందని ప్రశ్నించారు. 40 ఏళ్ల విట్ ప్రస్థానంలో వేలాది మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ప్రపంచ దేశాల్లో రాణిస్తున్నారన్నారు. విట్‌లో ప్రపంచంలోనే 71 దేశాలకు చెందినవారు, మనదేశంలోని 34 రాష్ట్రాలకు చెందిన 45 వేల మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. వీరందరికీ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో విద్యాబోధన జరుగుతోందని, వారి వ్యక్తిగత లక్ష్యానికి తగిన సహకారం విట్ అందిస్తోందన్నారు. స్నాతకోత్సవానికి విశిష్ట అతిథిగా హాజరైన అసోచామ్ కర్ణాటక స్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్, టొయోటా ఇండస్ట్రీస్ ఇంజన్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అడ్వైజర్ టి.ఆర్.పరశురామన్ మాట్లాడుతూ.. భారతదేశంలో మానవ వనరులు అధికంగా ఉన్నప్పటికీ స్కిల్ డెవలప్‌మెంట్ కొరత ఉందన్నారు. రాబోయే దశాబ్ద కాలంలో భారతదేశం మ్యానుఫ్యాక్చరింగ్ రంగంలో తప్పకుండా రాణిస్తుందని తెలిపారు. టీమ్ వర్క్ ద్వారా విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను తప్పక చేరుకుంటారని పేర్కొన్నారు. మరో విశిష్ట అతిథి నేషనల్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఫోరం చైర్మన్ ప్రొఫెసర్ అనిల్ డి.సహస్రబుదే మాట్లాడుతూ.. ఉన్నత విద్యకు తగిన ప్రాధాన్యత లభించినప్పుడే దేశం పురోగాభివద్ధి సాధిస్తుందన్నారు. 39వ స్నాతకోత్సవంలో విట్‌లో బ్యాచ్‌లర్ డిగ్రీలు, మాస్టర్ డిగ్రీలు, పిజి, రీసెర్చ్ స్కాలర్స్‌కు అతిథులు డాక్టరేట్ పట్టాలను అందజేశారు. స్నాతకోత్సవంలో విట్ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, డాక్టర్ శేఖర్ విశ్వనాథన్, డాక్టర్ జి.వి.సెల్వం, వైస్ ఛాన్సలర్ డాక్టర్ వి.ఎస్.కంచన భాస్కరన్, ఉప వైస్ ఛాన్సలర్ డాక్టర్ పార్థసారథి మాలిక్ పాల్గొన్నారు.

స్నాతకోత్సవంలో డిగ్రీ పట్టాలు అందుకుంటున్న విద్యార్థులు

## ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ముఖ్యమంత్రికి కార్మిక పరిషత్ వినతి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఎపిపిటిడి కార్మిక పరిషత్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌వి శేషగిరిరావు, వై శ్రీనివాసరావు సిఎం చంద్రబాబుకు వినతిని అందజేశారు. గత ప్రభుత్వం ఆర్‌టిసిని నిర్వీర్యం చేసిందని తెలిపారు. ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం మినహా అక్కడ వుండే సమస్యలను గుర్తించి పరిష్కరించే చర్యలను తీసుకోలేదన్నారు. 2019లో అప్పటి టిడిపి ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలను ఉద్యోగులకు అమలు చేయాలని కోరారు. అన్ని రకాల అలవెన్స్‌లను తిరిగి పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగోన్నతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కొత్త బస్సులను కొనుగోలు చేసి, ఆర్‌టిసిని బలోపేతం చేయాలన్నారు.

# ఉద్యోగులపై మళ్లీ కత్తి..!

- ఇంటెల్‌లో 10వేల మందికి ఉద్వాసన
- టాటా స్టీల్‌లోనూ 2800 మందికి ఎసరు

**శాన్‌ఫ్రాన్సిస్కో/ లండన్ :** పెట్టుబడిదారి అగ్రదేశాల్లో ఆర్థిక మందగమనం పెరుగుతోంది. టెక్, తయారీ కంపెనీల్లో కొత్త ఉద్యోగాల సృష్టి ఏమో కానీ ఉన్న ఉద్యోగాలు భారీగా ఊడుతున్నాయి. ఈ ఏడాది జనవరిలో లక్షలాది ఉద్యోగాలకు ఎసరు పెట్టిన అమెజాన్, ట్విట్టర్, మెటా, మైక్రోసాఫ్ట్, గూగుల్ చర్యలను మర్చిపోకముందే తాజాగా మరో విడత టెక్ కంపెనీలు ఉద్వాసనలపై దృష్టి పెట్టాయి. ఇటీవలే పరిస్థితులు మెరుగుపడ్డాయని అనుకునేలోపే కొత్త ఆర్థిక సంవత్సరంలోనూ మరోసారి వేటు పర్వం ఉద్యగులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది.

తాజాగా అమెరికాకు చెందిన ఎలక్ట్రానిక్ చిప్‌ల తయారీ సంస్థ ఇంటెల్ ఏకంగా 15,000 మందిని తొలగించడానికి సిద్ధం అయ్యింది. కంపెనీ మొత్తం ఉద్యోగుల సంఖ్యలో ఇది దాదాపు 15 శాతానికి సమానం కావడం గమనార్హం. ఉద్యోగులను తొలగించడం ద్వారా 2025లో 10 బిలియన్ డాలర్లు (రూ.850 కోట్లు) ఆదా కానుందని ఇంటెల్ క్రాప్ సిఇఒ పాట్ గెల్సింగర్ గురువారం వెల్లడించారు. 2024 జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఇంటెల్ 1.6 బిలియన్ డాలర్ల నష్టాన్ని చవి చూసింది. రెవెన్యూ 1 శాతం తగ్గి 12.8 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. 2023 చివరి నాటికి 124,800 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఇందులో 15 శాతం మందిని తొలగించాలని తాజాగా కంపెనీ నిర్ణయించింది. 'రెండో త్రైమాసికం ఫలితాలు నిరాశపరిచాయి. చాలా నిరాశాజనకంగా ఉన్నాయి. ఉత్పత్తులు, తయారీ ప్రక్రియలో ఎన్నో మైలురాళ్లను అధిగమించినప్పటికీ, ఆశించిన స్థాయిలో ఫలితాలు మాత్రం లేవు. దీంతో కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చింది. రానున్న రోజుల్లో ఇంకా కఠిన సవాళ్లతో కూడిన పరిస్థితుల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది' అని పాట్ గెల్సింగర్ తెలిపారు.

**టాటా స్టీల్‌లో కోతలు**

తమ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగుల్లో కోత విధిస్తామన్న ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవడం లేదని టాటా స్టీల్ స్పష్టం చేసింది. బ్రిటన్ తయారీ యూనిట్‌లోని 'కార్బన్ ఇంటెన్సివ్ బ్లాస్ట్ ఫర్నేస్' మూసివేత ప్రక్రియ ప్రారంభించినట్లు టాటా స్టీల్ గ్లోబల్ సిఇఒ టివి నరేంద్రన్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఇక్కడి ప్లాంట్‌లోని ఉద్యోగుల్లో తొలగింపులు ఉంటాయని తాము గతంలోనే చెప్పామన్నారు. ఆ ప్రతిపాదనల్లో ఎలాంటి మార్పులేదన్నారు. ఇప్పటికే ఒక కార్బన్ ఇంటెన్సివ్ బ్లాస్ట్ ఫర్నేస్‌ను మూసివేస్తున్నట్లు చెప్పామని.. ఆ మేరకు చర్యలు ప్రారంభమయ్యాయన్నారు. బ్రిటన్ ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు అవసరమని ప్రతిపాదనలు పంపించామన్నారు. తయారీ యూనిట్‌లోని మరో బ్లాస్ట్ ఫర్నేస్‌ను సెప్టెంబర్‌లో మూసివేసేలా చర్చలు జరుగుతున్నాయన్నారు. రెండు ఫర్నేస్‌లు మూతపడడంతో సౌత్ వేల్స్‌లోని పోర్ట్ టాల్బోట్ యూనిట్‌లో 2,800 వరకు ఉద్యోగాలు పోనున్నాయన్నారు. ఇటీవల భారత ఐటి కంపెనీల్లోనూ ఉద్యోగుల సంఖ్యలో భారీ తగ్గుదల చోటు చేసుకుంటుంది. దిగ్గజ ఐటి సంస్థ ఇన్ఫోసిస్‌లో 2024 జూన్ ముగింపు నాటికి మొత్తం ఉద్యోగుల సంఖ్య 3,15,332కు పరిమితమయ్యారు. మార్చి ముగింపు నాటికి ఈ సంఖ్య 3,17,240గా ఉండగా.. ఏడాదిలో నికరంగా 20,962 మంది ఉద్యోగులు తగ్గడం గమనార్హం.

## సాధారణ స్థాయికి గోదావరి

- మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ

**ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి**

గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సాధారణ స్థాయికి వరద ప్రవాహం చేరుకుంది. భద్రాచలం వద్ద 33.90 అడుగుల నీటిమట్టం నమోదైంది. 24 గంటల క్రితం ఇక్కడ 40.20 అడుగుల నీటిమట్టం నమోదైంది. సుమారు ఆరు అడుగుల మేర నీటిమట్టం తగ్గింది. క్రమక్రమంగా తగ్గుముఖం పట్టడంతో అల్లూరి సీతారామరాజు జిల్లా, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల్లోని పరీవాహక ప్రాంత ప్రజలకు కొంత ఊరట లభించింది. కాటన్ బ్యారేజీ వద్ద 10.40 అడుగుల నీటిమట్టం నమోదైంది. 24 గంటల క్రితం ఇక్కడ 12.10 అడుగుల నీటిమట్టం ఉండేది. బ్యారేజీ 175 గేట్ల ద్వారా 8.20 లక్షల క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాల్వలకు 8800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రాజమహేంద్రవరంలోని పాత బ్రిడ్జి వద్ద 13.96 అడుగుల నీటిమట్టం నమోదైంది. కాటన్ బ్యారేజీ వద్ద 11.75 అడుగులకు తక్కువగా నీటిమట్టం నమోదవ్వడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించినట్లు అధికారులు ప్రకటించారు.

## అనుమానాస్పద స్థితిలో వలస కార్మికుడు మృతి

**ప్రజాశక్తి - ప్రత్తిపాడు (గుంటూరు జిల్లా)**

ఒడిశాకు చెందిన వలస కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఈ సంఘటన గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెంలో శుక్రవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన జగదీష్ స్వేన్ (38) ఎనిమిదేళ్ల కిందట గుంటూరు జిల్లాకు వలసొచ్చారు. తెనాలి పరిసర ప్రాంతంలోని ఓ మిల్లులో పనిచేస్తుండేవాడు. ఇటీవల తుమ్మలపాలెం పరిసర ప్రాంతంలోని స్పిన్నింగ్ మిల్లులో పని మాట్లాడుకునేందుకు వచ్చాడు. ఒడిశాకు చెందిన కొందరు కార్మికులతో కలిసి అక్కడే ఉండిపోయాడు. గురువారం ఉదయం తన గదిలోని కిటికీకి ఉరేసుకున్నాడు. తోటి వారు గమనించి మృతుని సోదరుడికి సమాచారమిచ్చారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సదస్సులో మాట్లాడుతున్న వ్యకాసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

## భూ పంపిణీతోనే పేదలకు న్యాయం

- వ్యకాసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు

**ప్రజాశక్తి- సోమందేపల్లి (శ్రీసత్యసాయి జిల్లా)**

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన టిడిపి కూటమి ప్రభుత్వం తక్షణమే భూ పంపిణీ చేయాలని, అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండల కేంద్రంలోని లక్ష్మీ వెంకటేశ్వర కల్యాణ మండపంలో శుక్రవారం వ్యకాసం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ అధ్యక్షతన 'భూ సమస్య-ప్రాధాన్యత-వివిధ రాజకీయ పార్టీల వైఖరి' అన్న అంశంపై జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పదేళ్ల కాలంలో టిడిపి, వైసిపి ప్రభుత్వాలు పేదలకు ఎకరా భూమీ పంచలేదని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ఎకరాల పేదల అసైన్డ్ భూములు, అసైన్‌దారుల సాగులో ఉన్న భూములు అన్యాక్రాంతం అయ్యాయని, వీటిపై తక్షణమే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. కోనేరు రంగారావు కమిటీ సిఫారసు లను అమలు చేస్తూ ప్రతి కుటుంబానికి రెండెకరాల సాగు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన ప్రాంతాల్లో ప్రతి ఎకరాకు సాగునీరిచ్చి అభివృద్ధికి పాటుపడాలన్నారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేస్తే సరిపోదని, అసైన్మెంట్ చట్ట సవరణనూ రద్దు చేయాలని కోరారు. పేదల సాగు, అనుభవంలో ఉన్న భూములు, ఇళ్ల స్థలాలకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం ఇంతియాజ్, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, సహాయ కార్యదర్శి గంగాధర్‌తో పాటు సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## టిడిపి కార్యాలయంపై దాడి కేసులో మాజీ ఎమ్మెల్యే వంశీ అరెస్టు ?

**ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి, గన్నవరం**

కృష్ణా జిల్లా గన్నవరంలో టిడిపి కార్యాలయంపై దాడి కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ను పోలీసులు అరెస్టు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. తన కుటుంబ సభ్యులతో కలిసి ఆయన హైదరాబాద్‌లో నివసిస్తున్నట్లు తెలియడంతో పోలీసులు అక్కడికి వెళ్లి అరెస్టు చేశారని సమాచారం. హైదరాబాద్ నుంచి గన్నవరం వస్తుండగా ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. అయితే, పోలీసులు ఈ విషయాలను నిర్ధారించడం లేదు. మరోవైపు వంశీ అమెరికా వెళ్లిపోయినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆయన పాస్‌పోర్టు, వీసా వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. టిడిపి కార్యాలయం ధ్వంసం కేసులో వంశీ పేరును మొదట 71వ నిందితుడుగా పేర్కొనగా, ఆ తర్వాత ఎ-1గా మార్పుచేసినట్లు తెలిసింది. దాడిలో వంశీ నేరుగా పాల్గొనకపోయినా, ఆయన ప్రోద్బలంతోనే దాడి జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో వంశీసహా ప్రధాన నిందితులుగా ఉన్న ఓలుపల్లి మోహనరంగా, తేలప్రోలు రాము, అనగాని రవి, గొంది పరంధామయ్య, ఎమ్‌డి గౌసాని, మరో 10 మంది వరకు ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. దాడిపై టిడిపి కార్యాలయం ఆపరేటర్ ముదునూరి సత్యవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఐపిసి 143, 147, 148, 435, 506 రెడ్‌విత్ 149, 3(1) (ఎస్‌సి, ఎస్‌టి యాక్ట్) సెక్షన్ల కింద కేసు (క్రైమ్ నంబర్ 137/2023) నమోదు చేశారు.

**వంశీ ప్రధాన అనుచరుల అరెస్టు**

ఈ ఏడాది ఫిబ్రవరి 20న గన్నవరంలో టిడిపి కార్యాలయంపై జరిగిన దాడి కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ప్రధాన అనుచరుడు యూసఫ్ పఠాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మరో అనుచరుడు రమేశ్‌ను గురువారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో పోలీసులు 71 మందిని నిందితులుగా పేర్కొన్నారు. ఇప్పటికే 18 మందిని అరెస్టు చేశారు. మరో 14 మంది పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. గత నెల 9న బాపులపాడు ఎంపిపి నగేష్ సహా 15 మందిని, తర్వాత మరో ముగ్గురిని అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. వీరంతా గన్నవరం, నూజివీడు సబ్ జైళ్లలో ఉన్నారు. మిగిలిన వారంతా పరారీలో ఉన్నారు.

**వంశీని అరెస్టు చేయలేదు : ఎస్‌పి గంగాధరరావు**

మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని అరెస్ట్ చేయలేదని కృష్ణా జిల్లా ఎస్‌పి గంగాధరరావు తెలిపారు. వంశీని అరెస్టు చేసినట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని వెల్లడించారు. అయితే, టిడిపి కార్యాలయంపై దాడి కేసులో ఇద్దరు వంశీ అనుచరులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఆయన అనుచరుడైన రమేష్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు తెలిపారు. మరో అనుచరుడు, రౌడీషీటర్ యూసఫ్ పఠాన్‌నూ అరెస్టు చేశామని తెలిపారు. శనివారం కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

## తక్షణమే కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ

- డివైఎఫ్ఐ డిమాండ్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో గత రెండేళ్లుగా వివిధ కారణాలతో నిలిచిపోయిన పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల నియామకాల ప్రక్రియను తక్షణం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి పూర్తిచేయాలని డివైఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై రాము, జి రామన్న శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం 2022లో 6,100 పోలీస్ కానిస్టేబుల్ నియామకాలకు ఇచ్చిన నోటిఫికేషన్ ప్రక్రియను ఇప్పటి వరకు పూర్తి చేయకపోవడం అన్యాయమని అన్నారు. నోటిఫికేషన్ వచ్చాక మూడేళ్లు అవుతున్నా ప్రక్రియ ముందుకు సాగకపోవడం సరైంది కాదని పేర్కొన్నారు. న్యాయపరమైన సమస్యలను పరిష్కరించి తక్షణం ఈ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

## సుప్రీం తీర్పు అనాలోచిత నిర్ణయం : చింతామోహన్

**ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్**

ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అనాలోచిత నిర్ణయమని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. సుప్రీం తీర్పును నిరసిస్తూ చిత్తూరు కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా దేశ సమగ్రతను దెబ్బతీసేలా సుప్రీం తీర్పు ఉందని విమర్శించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో దళిత అధికారులను నియమించకపోవడం బాధాకరమన్నారు. తమిళనాడులోని స్టాలిన్ ప్రభుత్వం దళిత అధికారులకు పెద్దపీట వేస్తోందన్నారు. రాష్ట్రంలో మూతబడిన ఎస్‌సి కార్పొరేషన్లను టిడిపి కూటమి వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి కార్పొరేషన్లకు పూర్వ వైభవం తీసుకువచ్చి, ఉదారంగా నిధులు ఇవ్వాలని కోరారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డులో ఎస్‌సి సభ్యుడు లేకపోవడం బాధకరమన్నారు.

## హెచ్‌డిఎఫ్‌సి లైఫ్‌కు రూ.2 కోట్ల జరిమానా

**న్యూఢిల్లీ :** ప్రయివేటు రంగంలోని హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ పలు నిబంధనలు ఉల్లంగించడంతో ఆ సంస్థపై రూ.2 కోట్ల జరిమానా విధిస్తూ ఇన్సూరెన్స్ రెగ్యూలేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డిఎఐ) నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని ఆ కంపెనీ గురువారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. పాలసీదారుల ఆసక్తులను కాపడటంలో విఫలమయినందున రూ.1 కోటి, కంపెనీ అవుట్ సోర్సింగ్ విధానాల్లో లోపాలపై రూ.1 కోటి చొప్పున జరిమానా విధించింది. దీనికి సంబంధించి ఆగస్ట్ 1న ఐఆర్‌డిఎఐ నుంచి నోటీసులు అందుకుంది.

## సూర్యోదయ్ ఎస్‌ఎఫ్‌బి లాభాల్లో 47% వృద్ధి

**న్యూఢిల్లీ :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో సూర్యోదయ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (ఎస్ఎస్ఎఫ్‌బి) నికర లాభాలు 47 శాతం పెరిగి రూ.70 కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.48 కోట్ల లాభాలు ఆర్జించింది. గడిచిన క్యూ1లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం, వడ్డీయేతర ఆదాయాల్లో వృద్ధి మెరుగైన ఫలితాలకు దోహదం చేశాయని ఆ బ్యాంక్ తెలిపింది. నికర వడ్డీ ఆదాయం 30.5 శాతం పెరిగి రూ.293 కోట్లుగా, వడ్డీయేతర ఆదాయం 37 శాతం పెరిగి 70 కోట్లుగా చోటు చేసుకుంది. బ్యాంక్ స్థూల ఎన్‌పిఎలు 3.04 శాతం నుంచి 2.84 శాతానికి, నికర ఎన్‌పిఎలు 1.63 శాతం నుంచి 0.47 శాతానికి పరిమితమయ్యాయి.

## ఇన్నోవా హైక్రాస్ జడ్‌ఎక్స్‌లకు తిరిగి బుకింగ్

**బెంగళూరు :** టొయోటా కిర్లోస్కర్ మోటార్ తన ఇన్నోవా హైక్రాస్ జడ్ఎక్స్, జడ్ఎక్స్ (0)లకు తిరిగి బుకింగ్స్‌ను ప్రారంభించినట్లు శుక్రవారం ఆ సంస్థ ప్రకటించింది. 2022లో వీటిని విడుదల చేసినప్పటి నుండి అపూర్వ స్థాయిలో కస్టమర్ స్పందనను అందుకున్నట్లు తెలిపింది. సెల్ఫ్ ఛార్జింగ్ స్ట్రాంగ్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వేరియంట్ షేప్, గ్యాసోలిన్ వేరియంట్ రెండింటిలోనూ ఇన్నోవా హైక్రాస్ లభ్యమవుతుందని పేర్కొంది.

## ఐటిఆర్ ఫైలింగ్‌లో 7.5 శాతం వృద్ధి

**న్యూఢిల్లీ :** ఆదాయపు పన్ను రిటర్న్‌లో కొత్త రికార్డ్ నమోదయ్యింది. గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లో 7.28 కోట్ల ఐటిఆర్‌లు దాఖలయ్యాయి. ఇప్పటి వరకు ఇదే అత్యధికమని ఐటి వర్గాలు తెలిపాయి. ఇంతక్రితం 2022-23 నాటితో పోల్చితే 7.5 శాతం పెరుగుదల చోటు చేసుకుందని శుక్రవారం ఆదాయపు పన్ను విభాగం వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం ఐటిఆర్ దాఖలు చేయడానికి జులై 31తో గడువు ముగిసింది. ఉద్యోగులు, ఐటి ఫైలు చేస్తున్న వారి నుంచి వచ్చిన దాదాపు 10.64 లక్షల సందేహాలను ఇ-ఫైలింగ్ హెల్ప్‌డెస్క్ నివృత్తిఇ చేసినట్లు పేర్కొంది.

సంపాదకీయం

# 'మినిమమ్' బ్యాలెన్స్..!

కనీస నిల్వలు పాటించని సేవింగ్స్ అకౌంట్ ఖాతాదారుల నుండి బ్యాంక్‌లు జరిమానా పేరుతో భారీగా సొమ్ము వసూలు చేయడం దారుణం. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) మినహా పదకొండు ప్రభుత్వ రంగ బ్యాంకులు 2023-24 ఆర్థిక సంవత్సరంలో పొదుపు ఖాతాల్లో కనీస నిల్వను నిర్వహించడంలో విఫలమైనందుకు ఖాతాదారుల నుండి రూ.2,331 కోట్లు వసూలు చేశాయని కేంద్ర ఆర్థిక శాఖ పార్లమెంటుకు నివేదించింది. అంతకు ముందు ఏడాది అంటే 2022-23లో రూ. 1,855 కోట్లు పిండుకోగా ఇప్పుడు 25.63 శాతం అదనంగా ఈ బ్యాంకులు గుంజుకున్నాయన్నమాట. గత మూడేళ్లలో కనీస నిల్వను నిర్వహించనందుకు ఖాతాదారుల నుండి రూ.5,614 కోట్లు వసూలు చేశాయి. ఈ విధంగా ఖాతాదారుల నుండి జరిమానా పేరిట డబ్బు అప్పనంగా కొట్టేయడం బ్యాంకులకు తగని పని. కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయలను ఉదారంగా మాఫీ చేస్తున్న బ్యాంకులు సామాన్యుల నుండి ఇలా గోళ్లూడగొట్టి వసూలు చేయడం అమానుషం. బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బిఐ మాత్రం 2019-20 నుంచి కనీస బ్యాలెన్స్ మెయింటెయిన్ చేయని ఖాతాదారులపై జరిమానా విధించడాన్ని నిలిపివేయడం కొంత ఊరట కలిగించే విషయం. ప్రభుత్వ రంగ బ్యాంకుల సంగతిలా వుంటే రకరకాల రూపాల్లో జనం సొమ్ము కొల్లగొట్టే ప్రయివేటు బ్యాంకులు తమ ఖాతాల్లో కనీస నిల్వలు ఉంచడంలో విఫలమైతే ఖాతాదారుల నుంచి భారీ మొత్తాలను వసూలు చేస్తున్నాయి. ఆ విధంగా బ్యాంకులు సేవింగ్స్ ఖాతాదారుల నుండి ఈ రూపంలో సొమ్ము లూటీ చేయడం అమానుషం.

బ్యాంకుల్లో సేవింగ్స్ ఖాతా తెరిచేది పేదలు, సామాన్య మధ్యతరగతి వారేనని వేరుగా చెప్పనక్కరలేదు. అంతే కాదు! వివిధ రకాల ప్రభుత్వ పథకాలకు, రాయితీలు పొందడానికీ బ్యాంకు ఖాతా తప్పనిసరి అంటూ జనం చేత వాటిని తెరిపించేది ప్రభుత్వ అధికారులు లేదా వాటి ప్రమోటర్లే కదా! నరేంద్ర మోడీ తొలిసారి ప్రధాని అయిన సందర్భంలో విదేశాల్లోని నల్లధనాన్ని ప్రజల ఖాతాలో వేస్తామని సాగించిన భారీ ప్రచారాన్ని ఒక్కసారి గుర్తు చేసుకుంటే ఈ పాపంలో పాలకుల పాత్ర ఎంతుందో విదితమవుతుంది. ఆనాటి జన్‌ధన్ ఖాతాల హడావుడి కూడా ఎవరూ మర్చిపోలేరు. ఒకవైపున సర్కారువారే ఖాతాలు తెరిపించి వాటికి అనుసంధానంగా ఇన్సూరెన్స్ కూడా జత చేసి ఆ ప్రీమియంను ఖాతాదారుల నుండి వసూలు చేసిన విషయం చాలా మందికి అసలు తెలియనే తెలియదు. ఈ రూపంలో ఏటా ప్రీమియం కత్తిరింపు జరిగి కనీస నిల్వ తరిగిపోయిన ఖాతాదారులు కోకొల్లలు. ఇది కూడా బ్యాంకులు చేస్తున్న మరోవిధమైన లూటీయే కదా! పొదుపు ఖాతా నిర్వహణకు ఆ యా బ్యాంకులకు ఓవర్‌హెడ్స్ రూపంలో కొంత ఖర్చయ్యేమాట నిజమేకానీ వారు జరిమానా పేరిట గుంజుతున్నంత మొత్తమైతే అవ్వదన్నది నిర్వివాదాంశం.

అన్నిటి ధరలు విపరీతంగా పెరిగిపోతుండగా మరోవైపున ప్రజల ఆదాయాలు తరిగిపోతున్నాయని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. ధరలు, నిరుద్యోగం అన్న రెండు ప్రధానాంశాలే ఇటీవలి సాధారణ ఎన్నికల్లో ప్రభావితం చేశాయని పలు సర్వేలు నిగ్గు తేల్చాయి. ఇటువంటి నేపథ్యంలో ప్రజలు బ్యాంకుల్లో పొదుపు చేయడం అనేది ఓ మిలియన్ డాలర్ల ప్రశ్న లాంటిది. ఏడాదికేడాది ప్రజల పొదుపు తరిగిపోతున్నదని కేంద్ర గణాంకాల సంస్థ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ప్రతికూల పరిస్థితుల్లో ప్రజల్లో పొదుపు పట్ల అవగాహన కలిగించి, ఆసక్తి పెంచడం బ్యాంకులు, అంతకు మించి ప్రభుత్వమూ చేపట్టవలసి వుంది. ఆ పని మానేసి కనీస ఖాతా నిల్వ లేదనో ఇంకో పేరుతోనో ప్రజలపై భారాలు వేస్తూ పోతే అసలు బ్యాంకు గడపనెక్కడానికే జనం భయపడే స్థితి దాపురించే ప్రమాదముంది. 2008లో ప్రపంచాన్ని చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం భారతదేశాన్ని అంతలా దెబ్బ తీయకపోవడానికి మన బ్యాంకింగ్ రంగమూ, ద్రవ్య నిర్వహణా వ్యవస్థల పటిష్టత ఒక ముఖ్య కారణమని విశ్లేషకులు నిర్ధారించారు. మన బ్యాంకింగ్ వ్యవస్థను మరింతగా పటిష్టపరుచుకోవాలి. ఇంకా ఎక్కువ మందిని వాటి పరిధిలోకి తేవడం ఎంతో అవసరం. ప్రజల్లో పొదుపు పట్ల ఆసక్తి పెంచేందుకు తగు ప్రోత్సాహకాలివ్వాలి తప్ప బ్యాంకులు రకరకాల పేర్లతో జరిమానాలు విధించడం ఇప్పటికైనా మానుకోవాలి.

మహనీయుల మాట

నేను..నా దేశం..
ఈ రెంటిలో
నా దేశమే ముఖ్యమైనది.
- డా॥ బిఆర్ అంబేద్కర్,
భారత రాజ్యాంగ నిర్మాత.

---

వ్యాఖ్య

# జనగణన ఎందుకు లేదు?

> పార్లమెంటులో, శాసనసభల్లో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్ కల్పించే రాజ్యాంగ సవరణ జనాభా లెక్కల తర్వాతే ఆ పని జరగాలని నిర్దేశించింది. నియోజక వర్గాల పునర్విభజన ఆ తర్వాతే జరుగుతుంది. ఇప్పుడు జనాభా లెక్కలు తీయకపోవడమంటే మహిళల రిజర్వేషన్‌ను దూరానికి నెట్టివేసినట్టే. కనీసం 2029లోనైతే ఈ పని జరగకపోవచ్చు. జనగణన లేకపోవడం వల్ల కలిగే మరో ప్రభావం ఏమంటే పట్టణీకరణ జరిగిన అనేక గ్రామాలు చట్టబద్ధంగా పట్టణ హోదా పొందలేకపోతాయి. దాంతోపాటు వాటికి వచ్చే పురపాలనా వ్యవస్థల సదుపాయాలు అందబోవు. జనాభా లెక్కలు తీయకపోవడం వల్ల కలిగే మరో హానికర పర్యవసానం ఏమంటే పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాల హద్దుల పునర్విభజన జరగడానికి వుండదు. ప్రజాస్వామ్యంలో నియోజకవర్గాల హద్దుల నిర్ణయం ఎలా వుండాలంటే ప్రతి వ్యక్తి ఓటుకూ సమ తూకం వుండాలి.

2021లో జరగాల్సిన దశాబ్ది జనాభా లెక్కల కార్యక్రమం ఇంతవరకూ జరగలేదు. 2024-25 కేంద్ర బడ్జెట్‌లో జనాభా లెక్కల సేకరణకు అవసరమైన సమగ్ర కేటాయింపులేమీ లేవు. జిల్లా, తాలూకా, సమితి, గ్రామం వంటి పాలనా హద్దులను యథాతథంగా వుంచడం జనాభా లెక్కలకు అవసరం. కానీ 2024 జూన్ నాటికి వున్న పాలనా సరిహద్దులను మార్చడానికి వీలు లేకుండా స్తంభింపజేసే ఉత్తర్వులను పొడగించుతూ కేంద్రం ఎలాంటి పొడగింపూ ప్రకటించలేదు.

కనుక 2020లో ప్రారంభమై వుండాల్సిన 2021 జనాభా లెక్కలు నిరవధికంగా జాప్యం అవుతున్నాయి. కోవిడ్ ముగిసిన తర్వాతనే జనాభా లెక్కల కార్యక్రమం నిర్వహించడం సాధ్యమని ఆ తరుణంలో ప్రభుత్వం చెప్పింది. కాని ఆ తర్వాత మూడేళ్లు గడిచినా 2024లో కూడా జనాభా లెక్కలు సేకరించే సూచనలేవీ కనిపించడం లేదు. కోవిడ్ తర్వాత జనాభా లెక్కల సేకరణ జరగని నాలుగే దేశాల్లో భారత దేశం కూడా చేరుతున్నది.

**బ్రిటిష్ కాలం నుంచి దిక్సూచిగా...**

బ్రిటిష్ పాలనా కాలం నుంచి కూడా ప్రతి పదేళ్లకోసారి జనాభా లెక్కల సేకరణ క్రమం తప్పకుండా జరుగుతూ వస్తున్నది. 1941లో రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో కూడా అరకొరగానైనా జనాభా లెక్కల సేకరణ జరిగింది. ఎందుకంటే ఈ లెక్కల వల్ల కేవలం జనాభా ఎంత వున్నారనే విషయం మాత్రమే గాక గృహాలవారీ సమగ్ర సమాచార డేటా చేతికి వస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లోనైతే సాగుదార్లు, వ్యవసాయ కార్మికుల వివరాలు తెలుస్తాయి. గ్రామీణ పట్టణ జనాభా ఎలా వుంది? భాష మాట్లాడే జనాభా ఎంతమంది వున్నారు? షెడ్యూలు కులాలు తెగల జనాభా ఎంత వుంది? వంటి అంశాల గురించిన ఒక చిత్రం ఆవిష్కరించబడుతుంది.

ఈ సమాచార సంపద ఆధారంగానే అన్ని స్థాయిల్లోని విధాన నిర్ణేతలు, పరిపాలకులు తమ విధానాలను రూపొందించుకోవడం వాటిని వివిధ తరగతులవారికి అనువర్తింపచేయడం జరుగుతుంది. ఉదాహరణకు జాతీయ ఆహార భద్రతా చట్టం గ్రామీణ జనాభాలో 75 శాతానికి పట్టణ జనాభాలో 50 మందికి ఈ చట్టాన్ని వర్తింపచేయాలని చెబుతున్నది. అంతేకాకుండా జనాభా లెక్కల అంచనాల ఆధారంగా ప్రకటించిన వివరాలను బట్టి కేటాయింపులు చేయాలని చెబుతున్నది. 2021 లెక్కలను తీసుకుని ఈ చట్టం కింద 81.5 కోట్ల మందికి వర్తింపజేశారు. 2024 మార్చి నాటికి సంబంధించి వేసిన ముందస్తు అంచనా ప్రకారమైతే 93 కోట్ల మందికి దీన్ని అమలు చేయాల్సి వుంటుంది. అలా జరక్కపోవడమంటే 11 కోట్ల మంది అర్హులైన వారిని సబ్సిడీ లేదా ఉచిత ధాన్యాలు అందకుండా దూరం చేస్తున్నారని అర్థం.

**జరగకపోతే నష్టాలెన్నో!**

పార్లమెంటులో, శాసనసభల్లో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్ కల్పించే రాజ్యాంగ సవరణ జనాభా లెక్కల తర్వాతే ఆ పని జరగాలని నిర్దేశించింది. నియోజక వర్గాల పునర్విభజన ఆ తర్వాతే జరుగుతుంది. ఇప్పుడు జనాభా లెక్కలు తీయకపోవడమంటే మహిళల రిజర్వేషన్‌ను దూరానికి నెట్టివేసినట్టే. కనీసం 2029లోనైతే ఈ పని జరగకపోవచ్చు.

జనగణన లేకపోవడం వల్ల కలిగే మరో ప్రభావం ఏమంటే పట్టణీకరణ జరిగిన అనేక గ్రామాలు చట్టబద్ధంగా పట్టణ హోదా పొందలేకపోతాయి. దాంతోపాటు వాటికి వచ్చే పురపాలనా వ్యవస్థల సదుపాయాలు అందబోవు. జనాభా లెక్కలు తీయకపోవడం వల్ల కలిగే మరో హానికర పర్యవసానం ఏమంటే పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాల హద్దుల పునర్విభజన జరగడానికి వుండదు. ప్రజాస్వామ్యంలో నియోజకవర్గాల హద్దుల నిర్ణయం ఎలా వుండాలంటే ప్రతి వ్యక్తి ఓటుకూ సమ తూకం వుండాలి.

**ఎందుకీ ఉపేక్ష?**

మరి అలాంటప్పుడు ప్రభుత్వం జనాభా లెక్కల కోసం ఉత్తర్వు ఇవ్వాలనే ఉత్సుకత ఎందుకు ప్రదర్శించడం లేదు? గత కొన్నేళ్లలో శాస్త్రీయ ప్రాతిపదికన నిర్వహించిన సంఖ్యాపరమైన సర్వేల పట్ల ఒక సాధారణ తృణీకార భావన వుండటం ఒక కారణమై వుండొచ్చు. అనేక సర్వేలను తొక్కిపెట్టడం, సర్వేల తప్పుగా మార్చడంకోసం గణాంక కొలబద్దలను మార్చడం జరిగింది.

రాజకీయాలలోనూ విధానాల రూపకల్పనలోనూ అసంబద్ధతను ప్రోత్సహించేందుకు బిజెపి, ఆరెస్సెస్‌లు ప్రయోగిస్తున్న పాచిక ఇది. దీనికి ప్రేరణ హిందూత్వ భావజాలమే. ఉదాహరణకు అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ 2041 జనాభా లెక్కల నాటికి ముస్లిముల తాకిడితో హిందువులు అయిపు లేకుండా పోతారని పదేపదే చెబుతున్నారు. అలాంటి అహేతుక వాదనలతోనే అస్సాంలో ముస్లిం వ్యతిరేక చట్టాలు తేవడం, చర్యలు తీసుకోవడం జరుగుతున్నది.

**సన్నాహాలకు శ్రీకారం?**

కనుక బిజెపి హిందూత్వ శక్తుల అశాస్త్రీయ దృక్పథానికి జనాభా లెక్కలు సమిధలవుతున్నాయి. అందువల్ల విధానాల నిర్ణయం శాస్త్రీయ సమాచారం ఆధారంగా జరగాలన్నా, సమాజంలోని పీడిత వర్గాలన్నిటికీ న్యాయం లభించేలా భరోసా కల్పించాలన్నా ఇప్పటికే ఎంతో ఆలస్యమైన 2021 జనాభా లెక్కలు పై ఏడాదిలోనే జరగాలని గట్టిగా కోరాలి. అందుకోసం సన్నాహక కృషి ఈ ఏడాదే ప్రారంభం కావాలి. అన్ని ప్రజాస్వామిక తరగతులు, ప్రతిపక్షాలు ముక్త కంఠంతో అదే కోరాలి.

(జులై 31 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

---

సమస్య

# రాష్ట్రంలో అక్రమ తొలగింపులను అడ్డుకుంటాం...

> విచారణ చేయకుండా తొలగించడమనేది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం. నోటీసు ఇచ్చామని తొలగించినా అది చెల్లదు. విచారణ చేసి నేరం రుజువు అయితే మాత్రమే కార్మికునిపై చర్యలు తీసుకోవచ్చు. మొదటి తప్పుకు హెచ్చరిక మాత్రమే చేయాలి. తీవ్రమైన తప్పులు జరిగాయని రుజువు అయినప్పుడు మాత్రమే ఇంక్రిమెంటు కోత విధిస్తారు. కానీ ఉద్యోగాల నుండి తొలగించరు. కార్మికులను ఉద్యోగాల నుండి తొలగించడమంటే కార్మికునికి ఉరిశిక్ష వేయడం లాంటిదే. ప్రైవేటు యాజమాన్యాలు మాత్రమే చీటికి మాటికి అక్రమంగా తొలగింపులకు పాల్పడుతుంటాయి. అప్పుడు కూడా కార్మికులు పోరాటం ద్వారా తిరిగి పనిలోకి చేరుతుంటారు. తప్పనిసరి అయితే కోర్టులను కూడా ఆశ్రయిస్తారు. ఇటీవల జరిగిన తొలగింపులన్నీ అక్రమ తొలగింపులే. రాజకీయ కక్షలతో చేపట్టిన అక్రమ చర్యలే.

తెలుగుదేశం ప్రభుత్వం వచ్చినప్పటి నుండి నేటి వరకు రాష్ట్రంలో అనేక జిల్లాల్లో వివిధ రంగాల కార్మికులను అక్రమంగా తొలగిస్తున్నారు. ఈ తొలగింపులన్నీ రాజకీయ అక్రమ తొలగింపులే. దీనికి చట్టబద్ధత లేదు. స్థానిక గ్రామ పెద్దలు కక్షలతో తొలగిస్తున్నారు. కొత్తవారిని ఈ ఖాళీలలో ఉద్యోగాల్లో నియమించి లక్షలో డబ్బులు దండుకోవాలన్నది కొందరు నాయకుల ప్రయత్నం. కొన్ని జిల్లాల్లో కార్మికులను బలవంతంగా ఉద్యోగాల నుండి బయటకు గెంటివేస్తున్నారు. రాష్ట్రంలోని విఓఎ, ఆర్.పిలు (వెలుగు), మధ్యాహ్న భోజన కార్మికుల (వంటమ్మలు), ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశా, అంగన్‌వాడీ, మున్సిపల్ తదితర ప్రభుత్వ రంగాల్లో పని చేసే వేలాది మంది కార్మికులను తొలగించే హక్కు వీరికి ఎవరు ఇచ్చారు? ఏ చట్ట ప్రకారం తొలగిస్తున్నారు? సమాధానం చెప్పాలని సిఐటియు ప్రశ్నిస్తున్నది. అనంతపురం జిల్లా వజ్రకరువు మండలంలోని ఛాయాపురం గ్రామంలో 2003 నుంచి మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పనిచేస్తున్న వికలాంగురాలిని ఆ గ్రామ పెద్దలు బలవంతంగా బయటకి ఈడ్చుకొచ్చారు. ఈమెకు భర్త లేడు. కష్టపడి తన బిడ్డలను పోషించుకుంటున్నది. అలాంటి వారిపై దౌర్జన్యం చేయడం అత్యంత హేయమైన చర్య. అనంతరపురం జిల్లాలో 670 మంది వంటలమ్మలను తొలగించారు. మధ్యాహ్న భోజనం, విఓఎ, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశా, అంగన్‌వాడీలతో సహా అక్రమంగా వేలాది మందిని తొలగిస్తున్నారు. మహిళలపై దౌర్జన్యం చేసిన రాజకీయ నాయకుల ఒత్తిడికి భయపడి పోలీసులకు ఫిర్యాదు చేయడానికి కూడా కార్మికులు ముందుకు రావడం లేదు. ఆగస్టు 1 నుండి పల్నాడు జిల్లా నరసరావుపేట మున్సిపాలిటీలోని ఇంజనీరింగ్ సెక్షన్‌లో పని చేస్తున్న 52 మంది కార్మికులను ఎమ్మెల్యే ఆపివేయమన్నారని అధికారులు అక్రమంగా తొలగిస్తున్నట్లు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలంలోని గద్దెలపాడు గ్రామంలో లక్కివలస-2 సెంటర్ అంగన్‌వాడీ టీచర్, ఆయా, ఆశా ఉద్యోగులను తొలగిస్తామని, ఒక్కో ఉద్యోగం లక్షా 90 వేల రూపాయలకు వేలం పాట పెట్టారు. ప్రజలు, కార్మికుల నిరసనలతో గ్రామ పెద్దలు వెనక్కి తగ్గారు. ప్రకాశం జిల్లా, కంభం గ్రామంలో వంటలమ్మ తిరగబడి మీ ఇంట్లో పనికత్తెను కాదు, పొండని పెత్తందారులపై తిరగబడితే పెత్తందారుల మనుషులు తోకముడిచారు. రాజకీయ వేధింపులు పడలేక శ్రీ సత్యసాయి జిల్లా వీరప్పగారి పల్లి, ఓడిసి మండలంలో అంగన్‌వాడీ టీచర్ దీరంగల నాగమణి జులై 27వ తేదీన ఆత్మహత్యకు పాల్పడి హాస్పిట ల్‌లో వున్నారు. గ్రామ పెత్తందార్లు ఉద్యోగం నుండి రాజీనామా చేయమంటూ ఇంటి మీదకు వెళ్ళి నాగమణిని నోటికి వచ్చినట్టు తిట్టారు. ఆ తిట్లు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డారామె.

ఉద్యోగులు ఎవరైనా తప్పు చేస్తే మెమోలు ఇవ్వాలి. కార్మికుల నుండి సంజాయిషీ తీసుకోవాలి. దీనిపై అధికారులు సంతృప్తి చెందకపోతే విచారణ చేయాలి. విచారణ చేయకుండా తొలగించడమనేది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం. నోటీసు ఇచ్చామని తొలగించినా అది చెల్లదు. విచారణ చేసి నేరం రుజువు అయితే మాత్రమే కార్మికునిపై చర్యలు తీసుకోవచ్చు. మొదటి తప్పుకు హెచ్చరిక మాత్రమే చేయాలి. తీవ్రమైన తప్పులు జరిగాయని రుజువు అయినప్పుడు మాత్రమే ఇంక్రిమెంటు కోత విధిస్తారు. కానీ ఉద్యోగాల నుండి తొలగించరు. కార్మికులను ఉద్యోగాల నుండి తొలగించడమంటే కార్మికునికి ఉరిశిక్ష వేయడం లాంటిదే. ప్రైవేటు యాజమాన్యాలు మాత్రమే చీటికి మాటికి అక్రమంగా తొలగింపులకు పాల్పడుతుంటాయి. అప్పుడు కూడా కార్మికులు పోరాటం ద్వారా తిరిగి పనిలోకి చేరుతుంటారు. తప్పనిసరి అయితే కోర్టులను కూడా ఆశ్రయిస్తారు. ఇటీవల జరిగిన తొలగింపులన్నీ అక్రమ తొలగింపులే. రాజకీయ కక్షలతో చేపట్టిన అక్రమ చర్యలే.

తెలుగుదేశం ప్రభుత్వాన్ని గతంలో ఎన్నడూ లేనంత మెజార్టీతో ప్రజలు ఎన్నుకున్నారు. ప్రజలు ఈ ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. దీనికి చేతయితే రాష్ట్రంలో వున్న 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలను నింపాలి. 60 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు నింపాలి. వీటిపై ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపడం లేదు. నెలకు రూ.3 వేలు జీతం వచ్చే వంటలమ్మ మీద ఒంటి కాలితో యుద్ధానికి రావడానికి వీరికి సిగ్గు వేయడంలేదా? కొన్ని చోట్ల ఈ ఉద్యోగుల నుంచి బలవంతంగా రాజీనామా పత్రాలు తీసుకుంటున్నారు. రాజకీయ నాయకులు రాజీనామా పత్రం తయారు చేసి బలవంతంగా సంతకాలు పెట్టించినంత మాత్రన ఆ రాజీనామా చెల్లదు. ఈ రాజీనామా పత్రాలు ఎందుకూ పనికి రావు. టిడిపి నాయకులు కొందరు అధికారం వున్నదని అహంభావంతో తప్పుడు విధానాలు అవలంభించడం సరికాదు. పిచ్చుకపై బ్రహ్మాస్త్రం లాగా ఉద్యోగుల తొలగింపులకు తెలుగుదేశం నాయకులు ఉసికొల్పుతున్నారు. చిన్న ఉద్యోగులయితే ఏమీ చేయలేరని భావించడం సరికాదు. చిన్న ఉద్యోగులు ఒంటరిగా లేరు. రాజకీయ దౌర్జన్యాలు కొద్ది కాలం ఏ పార్టీ అధికారంలో వున్నా చేయగలరు. కానీ శాశ్వతంగా చేయలేరు. అధికారులు కూడా అక్రమ తొలగింపులను అడ్డుకోకుండా మౌనం వహించడం పద్ధతి కాదు. కార్మికుల నుండి ఫిర్యాదులొచ్చినా చట్టాలను అమలు చేసి తిరిగి ఉద్యోగాల్లో చేర్చుకోకపోవడానికి అధికారులు కూడా బాధ్యత వహించాలి. గత ప్రభుత్వ కాలంలో ఆ పార్టీ నాయకులు చెప్పారని తప్పుడు పనులు చేసిన అధికారులు నేడు నాలుక కరుచుకుంటున్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుండి ముఖ్యమంత్రి చంద్రబాబు కక్ష సాధింపు చర్యలు వుండవని పదేపదే ప్రకటించారు. గత ప్రభుత్వంలా కక్ష సాధింపులు, దౌర్జన్యాలు ఉండవని అసెంబ్లీ సాక్షిగా కూడా తెలిపారు. జిల్లా కలెక్టర్లతో సహా అధికారులు కార్మికులను తొలగించవద్దని కింది అధికారులకు ఆదేశాలు పంపుతున్నారు. అయినా అక్రమంగా తొలగించిన వారిని తిరిగి ఎక్కడా తీసుకోవడం లేదు. ఎమ్మెల్యేలు, మంత్రుల అండ లేకుండా స్థానిక నాయకులు దౌర్జన్యంగా కార్మికులను తొలగించగలరా? పెత్తందారుల వాదనలు అడ్డగోలుగా వున్నాయి. "మా పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇప్పటిదాకా మీరు తిన్నారు. ఇప్పటిదాక మీరు ఉద్యోగాలు చేశారు. ఇప్పుడు మా వాళ్ళు ఉద్యోగాలు చేస్తారు"...వంటి వాదనలు చేసే నాయకులకు...రాజకీయ పదవులకు, ఉద్యోగాలకు తేడా కూడా తెలియదా? పైన పేర్కొన్న రంగాల్లో పని చేసే కార్మికులందరికీ సర్వీసు కండిషన్లు వున్నాయి. పని గంటలు, పని విధి విధానాలున్నాయి. వీరందరికి ప్రభుత్వం జీతం చెల్లిస్తున్నది. వీరికి నియామకపు పత్రాలున్నాయి. గత వైఎస్‌ఆర్ ప్రభుత్వం వచ్చిన వెంటనే అక్రమ తొలగింపులకు పాల్పడ్డారు. గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్ట్‌లో పనిచేస్తున్న విద్యుత్ ఆపరేటర్ పోస్టులను రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు అమ్ముకున్నారు. సిఐటియు దీనిని అడ్డుకున్నది. అనేక మందిని తిరిగి ఉద్యోగాల్లో పెట్టించింది. కొన్ని చోట్ల పెత్తందారులు మొండిగా వుంటే సిఐటియు నాయకత్వంలో హైకోర్టుకు కూడా వెళ్ళి కార్మికులందరినీ తిరిగి పనుల్లో పెట్టించింది. గత ప్రభుత్వం చేసిన తప్పుడు పనులు చేస్తే ఈ ప్రభుత్వానికి కూడా ప్రజలు అదే శిక్ష వేస్తారు.

/ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న అక్రమ తొలగింపులకు వ్యతిరేకంగా 5వ తేదీన అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల దగ్గర నిరసన ప్రదర్శనల సందర్భంగా... /



సిహెచ్. నరసింగరావు

/ వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి /

---

చర్చ

# యువతను చిత్తు చేస్తున్న 'మత్తు'

యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్ (యుఎన్‌ఒడిసి)-2021 నివేదిక ప్రకారం 2019లో 27.5 కోట్ల మంది మాదకద్రవ్యాలను ఉపయోగించారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మాదకద్రవ్యాల వినియోగం మరింత వేగంగా పెరుగుతున్నది. గంజాయి అత్యంత విస్తృతంగా వినియోగించే డ్రగ్ అని నేషనల్ క్రైమ్ బ్యూరో (ఎన్‌సిబి) సర్వేలు చెబుతున్నాయి.

ఎన్నికల ముందు విశాఖపట్నం పోర్టులో సుమారు రూ.50 వేల కోట్ల విలువ చేసే 25 వేల కిలోల డ్రగ్స్ కంటైనర్ పట్టుబడింది. ఈ మాదకద్రవ్యాల కంటైనర్ వెనుక వున్నది మీరంటే మీరని అధికార ప్రతిపక్షాలు నాడు ఒకరి మీద ఒకరు విరుచుకు పడ్డాయి. ఈ కంటైనర్ బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలైన పురంధేశ్వరి బంధువులకు సంబంధించిన కంపెనీ నుండి ఆర్డర్ చేయబడిందని ఆరోపణలు వచ్చాయి. ఇంత జరిగిన తరువాత ఎన్నికల అనంతరం దీని గురించి ఎవరూ ప్రస్తావించడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి అక్రమ రవాణా విచ్చలవిడిగా పెరుగుతుందని సర్వేలే చెబుతున్నాయి. ఎన్‌సిబి నివేదిక ప్రకారం ఒక సంవత్సరంలో పట్టుబడ్డ మొత్తం గంజాయి 7,49,761 కేజీలు కాగా... ఆంధ్రప్రదేశ్‌లో పట్టుబడ్డది 2,00,888 కేజీలు. అంటే మొత్తం గంజాయిలో 26 శాతం ఆంధ్రప్రదేశ్ లోనే పట్టుబడింది. అంటే దానర్థం ఎక్కువ గంజాయి అక్రమ రవాణా మన రాష్ట్రంలో జరుగుతుందనేది వాస్తవం. ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా సరిహద్దు ప్రాంతంలో ఎక్కువగా గంజాయి సాగు జరుగుతుంది. ఎందుకంటే అక్కడ ఉన్న అటవీ ప్రాంతం ఈ సాగుకు భౌగోళికంగా సహకరస్తుంది.

స్థానిక ప్రజాప్రతినిధుల, ప్రభుత్వ అండదండలు లేకుండా గంజాయి సాగు చెయ్యడం, అక్రమ రవాణా సాధ్యం కాదు. గంజాయి సాగుతోబాటుగా వినియోగించే వారి సంఖ్య (ముఖ్యంగా 16 నుండి 25 సంవత్సరాల మధ్య వయస్కుల సంఖ్య) పెరుగుతున్నది. చాలా చోట్ల స్కూల్ పిల్లల చేతుల్లోకి కూడా గంజాయి వచ్చి చేరుతున్నదంటే ఈ మహమ్మారి ఎంతలా విస్తరించిందో అర్థం అవుతుంది. ఈ మాదకద్రవ్యాల పంపిణీలో సోషల్ మీడియా నేడు కీలక పాత్ర పోషిస్తున్నది. సోషల్ మీడియా ద్వారా డ్రగ్స్ వినియేగించేవారు కేవలం సరుకు కొనేవారిగానే కాక దాన్ని విస్తరించేవారిగా కూడా ఉంటారు. నూతన ఆర్థిక ఆవిష్కరణలు, మొబైల్ చెల్లింపులు, డిజిటల్ కరెన్సీ వంటి సాంకేతిక పరిజ్ఞానం ఈ విస్తరణకు తోడైంది. మారు మూల ప్రాంతాలకు కూడా జొమోటాలో ఫుడ్ మాదిరిగా గంజాయి, కొకైన్ వంటి మాదకద్రవ్యాలను మన చేతుల్లోకి తెచ్చి చేరుస్తున్నది.

సాధారణంగా ఏ వ్యాపారస్తుడైనా ఒక సరుకును అమ్మాలనుకుంటున్నప్పుడు మొట్టమొదట ఆ సరుకుని అందరికీ అలవాటు చేస్తాడు. ఈస్టిండియా కంపెనీ వాడు టీ అమ్మడం కోసం మొదట భారత దేశ ప్రజలకు టీ అలవాటు చేశాడు. అంబానీ జియో అలవాటు చేశాడు. మిగిలిన నెట్‌వర్క్‌లు అన్నీ కుదేలైపోయి నేడు దేశంలో ఎక్కువ మంది దాన్నే వాడుతున్నారు. అలాగే డ్రగ్ యజమానులు ప్రభుత్వ అండదండలతో డ్రగ్స్‌ని విచ్చలవిడిగా విస్తరింపజేస్తున్నారు. చివరికి అది ఒక వ్యసనంగా మారుతున్నది. కార్పొరేట్ విద్య, పెరుగుతున్న నిరుద్యోగం, ప్రతి అనుభూతిని ఆస్వాదించాలనే కుతూహలం విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు బానిసవడానికి దోహదపడుతున్నాయి. కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఉదయం నుండి సాయంత్రం వరకు విరామం లేకుండా అనేక రకాల కోచింగ్‌ల పేరుతో చదివించడంతో విద్యార్థులు ఒత్తిడికి గురయ్యి దాని నుండి బయట పడటానికి గంజాయి తీసుకోవడం, సిగిరెట్లు ఎక్కువగా తాగడం చేస్తున్నారు. ఇలా ప్రతి రోజూ చెయ్యడంతో అది వ్యసనంగా మారుతున్నది. ఇంజనీరింగ్ విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు పబ్ కల్చర్‌కు అలవాటు పడుతూ గంజాయి తీసుకుంటున్నారు. లక్షలు ఖర్చు పెట్టి చదివిన తరువాత ఉద్యోగాలు లేక నిరుద్యోగం పెరిగిపోవడంతో ఒకవైపు తల్లిదండ్రుల నుండి మరోవైపు సమాజం నుండి ఎదురవుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక డ్రగ్స్‌కు అలవాటు పడ్డవారు దీనిని రెండు రకాలుగా వినియోగిస్తున్నారు. ఒకటి-తను వినియోగించుకోవడానికి. రెండు-డబ్బులు సంపాదించడానికి. ఎక్కువ మంది నిరుద్యోగులు ఈ మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో భాగస్వామ్యం అవుతూ పెడదారి పడుతున్నారు.

మాదకద్రవ్యాల అక్రమ రవాణాను వ్యవస్థీకృతం చెయ్యడం వలన హింస పెరుగుతున్నది. రాష్ట్రంలో జరిగిన అధిక నేరాలు, హత్యలు డ్రగ్స్ మత్తులో ఉన్నప్పుడు చేసినవే. మత్తు పదార్థాలకు అలవాటు పడ్డవారు సరైన సమయంలో డబ్బులు లేకపోవడంతో దొంగతనాలకు, హత్యలకు పాల్పడుతున్న ఘటనలున్నాయి. దీన్ని అరికట్టాల్సిన ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే మద్యం లేకుండా చేస్తామని చెప్పి...నేడు మద్యాన్ని ఏరులై పారిస్తున్నది. దాన్ని రాజకీయ, ఆర్థిక అవసరాలకు ఉపయోగించుకుంటున్నది. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పెంచిపోషిస్తుంది. మాదకద్రవ్యాల అక్రమ రవాణా అనేది రాజకీయ, ఆర్థిక, సామాజిక, భద్రత ఇలా అన్నింటితో ముడిపడి ఉంటుంది. కాబట్టి దీన్ని అరికట్టాలంటే మాదకద్రవ్యాలకు సంబంధించిన సాగు, ఉత్పత్తి, తయారీ, రవాణా, పంపిణీ, అమ్మకం ఇలా అన్ని దశలను పరిష్కరించాలి. పోర్టులు, రైల్వేలు, ఎయిర్‌లైన్స్ వంటి రవాణా వ్యవస్థలన్నీ ప్రైవేటీకరణ చేయడం వలన ఇది మరింత కష్టం అవుతుంది. దీనికి ఉన్న ఏకైక మార్గం ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం. లేకుంటే రాష్ట్రంలో ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు, యువకుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతుంది.

- డి.రాము,
ఎస్.ఎఫ్.ఐ విజయనగరం జిల్లా అధ్యక్షులు,
సెల్ : 9705545164.

**మీ రచనలను పంపాల్సిన మెయిల్ :**
editpageps@ gmail.com

## నేడు టిడిపి ఆఫీసులో సిఎం గ్రీవెన్స్

**అమరావతి బ్యూరో :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టిడిపి కార్యాలయంలో శనివారం గ్రీవెన్స్ కార్యక్రమం చేపట్టనున్నారు. ఉదయం 11 గంటల నుంచి పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటూ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారని టిడిపి కార్యాలయం కార్యదర్శి, ఎమ్మెల్సీ పి అశోక్ బాబు తెలిపారు. ప్రజావేదిక పేరుతో ప్రతి శనివారం ముఖ్యమంత్రి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తున్న విషయం తెలిసిందే.

Form No.3
(See Regulation -15(1)(a)]/16(3)

**DEBTS RECOVERY TRIBUNAL VISHAKHAPATNAM**
**Ground & 1st Floor, 31-31-21, Sai Baba Street, Narayan Bhawan, Dabagardens, Visakhapatnam- 530020**

**Case No.: O.A. No. 51.of 2021**

**Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993.**
**Bank Of Baroda Limited**
**And**
**Nanduri Naga Sandeep**

To,
**Mr. Nanduri Naga Sandeep, S/o Veera Venkata Prasad, D.No. 10/202, SRMT Road, SN Puram,Gudivada**

**SUMMONS BY WAY OF PAPER PUBLICATION**

WHEREAS,**OA 51/2021** was listed before Hon'ble Presiding Officer/Registrar on **07.08.2024**

WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons/ notice on the said Application under section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of Rs **31,02,422 /-** (application along with copies of documents etc. Annexed).

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:-

(I) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(Ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(Iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for **attachment of properties:**
(Iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/ or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(V) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Presiding Officer/Registrar on **07.08.2024 at 10:30 A.M.** failing the application shall be heard and decided in your absence.

Given under my hand and the seal of this Tribunal on this date:**30.07.2024**

**Signature of the Officer Authorised to Issue summons**
**Assistant Registrar**
**Debts Recovery Tribunal,**
**Visakhapatnam**

HEMADRI CEMENTS LIMITED
**Admin. Office: No3, Veerasamy Street, III Floor, West Mambalam, Chennai - 600 033. CIN: L26942AP1981PLC002995**
**Website: www.hemadricements.com**

**NOTICE OF POSTAL BALLOT**

Notice is hereby given to members that, it is proposed to transact certain business as set out in the Notice of Postal Ballot which has already been dispatched to you. The despatch of notice of postal ballot along with all relevant forms will be completed before 7th August 2024

In terms of the provisions of Companies Act 2013, the business as set out in the Notice of Postal Ballot may be transacted through voting by electronic means (e-voting). The Company has engaged the services of Central Depository Services Limited (CDSL) to provide the e-voting facility. The Voting rights of members have been reckoned as on 2nd August 2024 which was the cutoff date. Voting through Postal Ballot including voting by electronic means shall commence from 10:00 A.M on 7th August 2024 and end on 05th September at the close of working hours i.e., 5:00 P.M (both days inclusive).

Members are requested to note that duly completed and signed Postal Ballot form should reach the scrutinizer on or before the close of working hours i.e., 5:00 P.M on 5th September 2024. Any postal ballot form received from a member beyond 5:00 P.M on 5th September will not be valid and voting whether by post or electronic means shall not be allowed beyond 5:00 P.M on 5th September 2024.

Members who have not received Postal Ballot forms may apply to the Company's Registrar & Transfer Agents, Cameo Corporate Services Limited at Subramanian Building #1, Club House Road , Chennai 600 002 at the email-ids: investor@cameoindia.com or to the Company Secretary of the Company at the email id cs@hemadricements.com and obtain a duplicate thereof.

The notice of Postal Ballot is displayed on the website of the Company viz., https://hemadricements.com and on the website of CDSL, namely https://evoting.cdslindia.com

The Board of Directors at their meeting held on 2nd August have appointed Mr. N. Ramanathan, Designated Partner of S Dhanapal & Associates LLP, Practising Company Secretaries, Chennai as the Scrutinizer for conducting the postal ballot in a fair and transparent manner.

Members may kindly note that the Chairman or the person authorized by him in this regard will announce the results of the Postal Ballot on or before 6th September, 2024 at the Registered Office of the Company.

Mr. Krish Narayanan, Company Secretary of the Company will be responsible to address the grievances connected with the voting by postal ballot including voting by electronic means. His contact details are as follows :

**Date : 02-08-2024**
**Regd Office: Vedari Village- 521 457, Jaggaiahpet Mandal, Krishna District, A.P.(India)**
**Email ID: cs@hemadricements.com**
**Ph: 08678-284538**

**Mr. Krish Narayanan,**
**Company Secretary & Compliance Officer,**
**HEMADRI CEMENTS LTD.,**
**CIN: L26942AP1981PLC002995**

పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఉద్యోగులు, నాయకులు

# ఫీల్డ్ అసిస్టెంట్లపై వేధింపులు ఆపండి

- ఉద్యోగ భద్రత కల్పించాలి
- పంచాయతీరాజ్ కమిషనరేట్ వద్ద బైఠాయింపు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక అక్రమంగా తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని, తక్షణం రాజకీయ వేధింపులను ఆపాలని డిమాండ్ చేస్తూ ఫీల్డ్ అసిస్టెంట్లు పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం ముందు పెద్ద సంఖ్యలో బైఠాయించారు. సిఐటియు అనుబంధ సంఘం ఏపి గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ ఆధ్వర్యాన రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లు తరలివచ్చి తాడేపల్లిలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ కార్యాలయం ముందు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపి గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షులు ఎం పరంధామయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి నరసింహులు మాట్లాడారు. ఏళ్ల తరబడి ఉపాధి హామీ పథకం అమలులో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారిని రాజకీయ కారణాలతో విధుల నుంచి తొలగించడం అన్యాయమని అన్నారు. ఇప్పటికే 2,360 మందిని కూటమి ప్రభుత్వం తొలగించిందన్నారు. అధికార పార్టీ వేధింపులకు తాళలేక వివిధ ప్రాంతాల్లో ఆత్మహత్యాయత్నం చేసిన ఎనిమిదిమంది ఫీల్డ్ అసిస్టెంట్లలో నలుగురు మరణించారని, వారి కుటుంబాలకు తక్షణం ఎక్స్‌గ్రేషియాను చెల్లించాలని డిమాండ్ చేశారు. తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉపాధి కల్పించే తమపై వేధింపులను నిలుపుదలచేసేవరకు పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. అనంతరం కమిషనర్ కృష్ణతేజకు తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని, మృతులకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా కన్వీనర్ కె ధనలక్ష్మి, ఏపి గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు వీరేష్ గౌడ్, భారతీబాబు, మహేష్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు. మంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ కృష్ణతేజ యూనియన్ నాయకులకు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# సమన్వయంతోనే ప్రజాస్వామ్యం

- సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- గవర్నర్లకు రాష్ట్రపతి ఉద్బోధ
- రెండు రోజుల సదస్సు ప్రారంభం

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

ప్రజాస్వామ్యం సజావుగా సాగడం చాలా కీలకమని, అందుకు గవర్నర్లు సమన్వయంతో పని చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్బోధించారు. గత దశాబ్దంలో జరిగిన సామాజిక సంక్షేమ పథకాలు, న అభివృద్ధి గురించి ప్రజలకు అవగాహన కల్పించే రాజ్యాంగ బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. శుక్రవారం నాడిక్కడ రాష్ట్రపతి భవన్‌లో రెండు రోజుల గవర్నర్ల సదస్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. కేంద్ర-రాష్ట్ర సంబంధాలను బలోపేతం చేయడమే కాకుండా సామాన్య ప్రజల సంక్షేమ పథకాలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తున్న అనేక అంశాలను ఈ సదస్సు చర్చించారు. జాతీయ విద్యా విధానంలో విద్యాసంస్థల అక్రిడిటేషన్, అసెస్‌మెంట్ వ్యవస్థను మెరుగుపరచడంపై దృష్టి సారించాలని కోరారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ హోదాలో గవర్నర్లు ఈ సంస్కరణ ప్రక్రియకు సహకరించాలని ఆమె కోరారు. నేర న్యాయానికి సంబంధించి ఎలాంటి చర్య లేకుండా కేంద్ర ప్రభుత్వం అమలులో పెట్టిన మూడు కొత్త చట్టాలను ఆమె ప్రశంసించారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో భూసారాన్ని పెంచి రైతుల ఆదాయాన్ని పెంచవచ్చని అన్నారు. రాజ్‌భవన్లు దీనిని ప్రోత్సహించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలగురించి [illegible] గిరిజన జనాభాలో ఎక్కువ భాగం షెడ్యూల్, గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్నారని, ఈ ప్రాంతాల ప్రజల సమ్మిళిత అభివృద్ధి సాధించడానికి మార్గాలను సూచించాలని ఆమె గవర్నర్లను కోరారు. ఐక్యతా స్ఫూర్తిని మరింత బలోపేతం చేసేందుకు గవర్నర్లు సహకరించాలని అన్నారు. గవర్నర్లందరూ తమ ప్రమాణానికి న్యాయం చేస్తూ ప్రజల సేవకు, సంక్షేమానికి తమ వంతు సహకారం అందించాలని ఆమె కోరారు.

**గవర్నర్లు కేంద్ర, రాష్ట్రాల మధ్య వారధులు : మోడీ**

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మాట్లాడుతూ, గవర్నర్లు కేంద్రం, రాష్ట్రాల మధ్య వారధిగా ఉండాలని అన్నారు. గవర్నర్ పదవి రాజ్యాంగ పరిధిలోని రాష్ట్ర ప్రజల సంక్షేమంలో ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో కీలకపాత్ర పోషించాలని అన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ ప్రజల్లో విశ్వాసాన్ని నింపేందుకు, అభివృద్ధి పనులకు పునరుత్తేజం కల్పించేందుకు గ్రామాలను, వెనుకబడిన జిల్లాలను సందర్శించాలని గవర్నర్లను కోరారు.

# రూ.4.5 లక్షల కోట్ల సంపద ఆవిరి

- సెన్సెక్స్ 886 పాయింట్ల పతనం

**ముంబయి :** దేశీయ స్టాక్ మార్కెట్లు వారాంతంలో భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితులతో శుక్రవారం బిఎస్ఇ సెన్సెక్స్ 886 పాయింట్లు లేదా 1.08 శాతం పతనమై 80,982కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 293 పాయింట్లు లేదా 1.17 శాతం నష్టపోయి 24,718 వద్ద ముగిసింది. ఒక్క పూటలోనే బిఎస్ఇ మార్కెట్ కాపిటలైజేషన్ రూ.4.56 లక్షల కోట్లు ఆవిరై.. రూ.457.06 లక్షల కోట్లుగా నమోదయ్యింది. దీంతో ఆ మొత్తం మదుపర్లు నష్టపోయినట్లయ్యింది.

పశ్చిమాసియాలో ఇజ్రాయెల్, హమాస్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు ప్రపంచ మార్కెట్లపై ప్రభావం చూపాయి. ముడి చమురు ధరల పెరుగుదల, కార్పొరేట్ సంస్థల ఆర్థిక ఫలితాలు అంచనాలు చేరకపోవడం, అమెరికా, ఆసియా మార్కెట్లలో ప్రతికూలాంశాలు భారత మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపాయి. నిఫ్టీ 50లోని 42 స్టాక్స్ నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్-30లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, సన్ ఫార్మా, నెస్లే మినహా మిగితా స్టాక్స్ అన్నీ నేల చూపులు చూశాయి. నిఫ్టీలో రియాల్టీ, ఆటో, ఐటి, లోహ సూచీలు అధికంగా 2-3 శాతం వరకు విలువ కోల్పోయాయి. ఫార్మా, వైద్య స్టాక్స్ మాత్రమే సానుకూలంగా నమోదయ్యాయి. బిఎస్ఇ స్మాల్ క్యాప్, మిడ్ క్యాప్ సూచీలు 1.2 శాతం వరకూ పతనం అయ్యాయి.

**ది గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్**
హెడ్ ఆఫీస్ : నెం. హెచ్.948, మ్యూజియం రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520002. ఫోన్ : 0866-2433379, 2436365

**స్వాధీనతా ప్రకటన** (అనుబంధం - 4 - స్థిరాస్తి కొరకు)

**సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ యొక్క రూల్ 8(1) క్రింద. సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద ఏర్పాటు కాబడినది.** SARFAESI చట్టం 2002 క్రింద బ్యాంక్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 9తో చదవబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ SARFAESI చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద రుణగ్రహీతలు/సహ రుణగ్రహీతలు/రుణగ్రహీతల యొక్క న్యాయవారసులకు డిమాండు నోటీసు జారీచేసి సదరు నోటీసులో పేర్కొనబడిన మొత్తంతో పాటు చెల్లించు వరకు తదుపరి వడ్డీ మరియు ఛార్జీలు మొదలగు వాటిని తిరిగి చెల్లించవలసిందిగా కోరడమైనది. రుణగ్రహీతలు దిగువ పేర్కొనబడిన మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఇందుమూలముగా ప్రత్యేకించి పైన పేర్కొనబడిన రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానికమునకు తెలియజేయునది ఏమనగా సదరు రూల్స్ యొక్క రూల్ 9తో చదవబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ పేర్కొనబడిన ఆస్తిన దిగువ సంతకందారు **లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకున్నారు.** ప్రత్యేకించి పైన పేర్కొనబడిన రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎటువంటి లావాదేవీలు జరుపకూడదు మరియు ఆస్తులతో ఏవేని లావాదేవీలు జరిపితే లోన్ రీకాల్ డిమాండ్ నోటీసులో పేర్కొనబడిన మొత్తంతో పాటు తదుపరి వడ్డీలు, ఛార్జీలు మొదలగు వారి కొరకు బ్యాంకు యొక్క ఛార్జీకి లోబడి ఉండగలదు. హామీగల ఆస్తులు విడిపించుకొనుటకు అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి SARFAESI చట్టం 2002 యొక్క సెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్ (8) నిబంధనలను రుణగ్రహీతల దృష్టికి తీసుకురావడం జరుగుచున్నది.

| | |
|---|---|
| 1 | **రుణగ్రహీతల వివరాలు: మరణించిన ప్రధాన రుణగ్రహీత, కట్టా శివమ్మ,** W/o వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు. **1. కుమార్తె: లోయ లక్ష్మి,** W/o శివ నాగ రాజు **2. కుమార్తె: లోయ పద్మ,** W/o శ్రీనివాసరావు **3. కుమార్తె: వీరాల రాజేశ్వరి,** W/o మల్లికార్జునరావు. **డిమాండ్ నోటీసు తేదీ:** 07-03-2024. **బకాయి మొత్తం రూ.17,69,323/-** ది.29.02.2024 నాటికి తదుపరి వడ్డీతో పాటు. **వుయ్యూరు బ్రాంచ్** నందలి **లోన్ నెం. 032213001180**లో పూర్తిగా చెల్లించే వరకు. **ఆస్తి వివరణ:- ఆస్తి హోల్డర్: లేట్ కట్టా శివమ్మ,** డోర్ నెం. 1-73, అండర్ బ్రిడ్జి, మెయిన్ రోడ్, మద్దివాడ, పమిడిముక్కల మండలం, కృష్ణా జిల్లా. అసెస్‌మెంట్ నెం.67. వుయ్యూరు సబ్ రిజిస్ట్రీ కింద డాక్ నెం.4682/2012. సర్వే నెం.67/2లో 240 చదరపు గజాల ఆస్తి RCCB బిల్డింగ్‌ను కలిగి ఉంది. **ఆస్తి సరిహద్దులు:** తూర్పు:- జాయింట్ బజార్ (60 అడుగులు) దక్షిణం:- మునికుట్ల రమేష్ (36 అడుగులు) పశ్చిమం:- జంపన పూర్ణచంద్రరావు (60 అడుగులు) ఉత్తరం:- పుటగుంట పూర్ణచంద్రరావు (36 అడుగులు). **స్వాధీనం చేసుకున్న తేదీ: 01-08 -2024** |
| 2 | **రుణగ్రహీతల వివరాలు: ప్రధాన రుణగ్రహీత కనమల ఫ్రాన్సిస్,** S/o వరదయ్య **మరణించినందున వారి కుటుంబ సభ్యులు 1. సహ రుణగ్రహీత మరియు కుమార్తె: కనమల తేజ సంగీత 2. కుమార్తె: కనమల గీతాంజలి,** W/o సలీమ్ **3. కుమార్తె: సాదే జ్యోతి కుమారి,** W/o శ్రీనివాసరావు **4. కొడుకు: కనమల దీపక్ అనిల్ కుమార్. డిమాండ్ నోటీసు తేదీ:** 01-06-2023 **బకాయి మొత్తం: రూ.12,32,535/-** 31.05.2023 నాటికి తదుపరి వడ్డీతో పాటు **వుయ్యూరు బ్రాంచ్ నందలి లోన్ నంబర్ 032213001300**లో పూర్తిగా చెల్లించే వరకు. **ఆస్తి వివరణ:-** డోర్ నెం. 7-156/1, సంతోష్ పబ్లిక్ స్కూల్ దగ్గర, వల్లూరు రోడ్, వుయ్యూరు, కృష్ణాజిల్లా. సర్వే నెం.1025/1లో 289.6 చ.గజాల ఆస్తి RCC బిల్డింగ్‌ను కలిగి ఉంది. అసెస్‌మెంట్ నెం.5434. వుయ్యూరు సబ్ రిజిస్ట్రీ కింద డాక్ నెం.2484/1992 & CERSAI ఛార్జ్ Id: 400070834342. **ఆస్తి సరిహద్దులు:** తూర్పు:- 4 గజాల మార్గం (33 అడుగులు) దక్షిణం:- అమ్మెన బీబీ (79 అడుగులు) పశ్చిమం:- ఆదిరాజు నరసింహారావు (79 అడుగులు) 33 అడుగులు) ఉత్తరం:- గరికిపాటి రాఘూర్ (79 అడుగులు). స్వాధీనం చేసుకున్న తేదీ: 01-08-2024. **స్వాధీనం చేసుకున్న తేదీ: 29-07 -2024.** |

**ది.02-08-2024, స్థలం : విజయవాడ**
**సం/- ఆథరైజ్డ్ ఆఫీసర్, ది గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్**

**ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్**
(గతంలో ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌గా తెలిసినది) CIN: L65110TN2014PLC097792
**రిజిస్టర్డు ఆఫీసు:** కెఆర్ఎం టవర్స్, 7వ అంతస్తు, హ్యారింగ్టన్ రోడ్, చెట్పెట్, చెన్నై-600031. Tel: +91 44 4564 4000 | Fax: +91 44 4564 4022
IDFC FIRST Bank

**అనుబంధం-4-ఎ (రూల్ 8(6)& 9(1) లోని ప్రొవిజో చూడండి) స్థిరాస్తుల అమ్మకానికి సంబంధించి విక్రయ ప్రకటన**

**సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) & 9(1) ప్రొవిజో ప్రకారం సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి సంబంధించి ఇ-వేలం విక్రయ ప్రకటన**

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకించి రుణగ్రహీత(లు) మరియుసహ-రుణగ్రహీత(ల)కు తెలియజేయునది ఏమనగా దిగువ కాలమ్- (iii) లో పేర్కొన్నదిగువ పేర్కొన్న కాలమ్-(iv)లో పేర్కొన్న స్థిరాస్తులు సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టబడిన/ఛార్జ్ చేయచేసినవి గతంలో ఐడిఎఫ్‌సి బ్యాంకు లిమిటెడ్‌గా అధీకృత అధికారిచే స్వాధీనంలోకి తీసుకున్నారు, అవి కాలమ్-(i) ప్రకారం రుణగ్రహీత(లు) మరియు సహ-రుణగ్రహీత(ల) నుండి ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌గా తెలిసినది) వారికి మొత్తాల బకాయిల రికవరీ కొరకు దిగువ వివరించినట్లుగా "ఎక్కడ ఎలా ఉన్నది మరియు "అక్కడ అలాగే ప్రాతిపదికన" విక్రయించబడును.

విక్రయానికి సంబంధించిన షరతులు, నిబంధనల కోసం దయచేసి ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క వెబ్‌సైట్ www.idfcfirstbank.com లో కల్పించిన లింక్‌ను పరిశీలించండి.

| క్ర. సం. | (i) డిమాండ్ నోటీసు మొత్తం | (ii) అగ్రిమెంట్ ఐడి | (iii) రుణగ్రహీత(లు), సహ-రుణగ్రహీత(లు) & హామీదారు(ల) పేరు | (v) రిజర్వ్ ధర మొత్తం | (vi) ఇఎండి మొత్తం | (vii) వేలం తేదీ& సమయం | (viii) వేలం యొక్క ఇఎండి తేదీ& సమయం | (ix) పరిశీలన తేదీ & సమయం | (x) అధీకృత అధికారి యొక్క పేరు & సంప్రదించు నెంబర్ |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1. | లోన్ అగ్రిమెంట్ నం.: HL03GUT000010136 1. మనోజ్ కుమార్ దేవరపు, 2. దేవరపు గురవమ్మ, ఇరువురి నివాసం : డో.నం.3-3-21/ఎ, చంద్రమౌశ్వర అగ్రహారం, ఎస్‌బి జూట్‌మిల్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522 006. ఇక్కడ కూడా : కన్న టవర్స్, అంకిరెడ్డిపాలెం గ్రామం రోడ్డు, చల్లావారిపాలెం గ్రామ పంచాయతీ అంకిరెడ్డిపాలెం హామ్లెట్ గుంటూరు, మస్జిద్ వద్ద అంకిరెడ్డిపాలెం గ్రామం రోడ్డు, చల్లావారిపాలెం గ్రామం గుంటూరు, గుంటూరు-522 005, ఆంధ్రప్రదేశ్. | 31.07.2024 నాటికి రూ. 33,29,909/- (ముప్పై మూడు లక్షల ఇరవై తొమ్మిది వేల తొమ్మిది వందల తొమ్మిది రూపాయలు మాత్రమే) | ఎ- షెడ్యూల్ : గుంటూరు జిల్లా, నల్లపాడు ఉపజిల్లా, చల్లావారిపాలెం గ్రామ పంచాయతీ ఏరియా, అంకిరెడ్డిపాలెం గ్రామం, డో.నం.823, బయట 2553-14 చ.గ.లు. కన్నా టవర్స్ భవనం యొక్క మూల్యాంకనం నం.326 తో విస్తీర్ణం 2148-55 చ.గ.లు. హద్దులు : తూర్పు : రోడ్డు 151'-06", దక్షిణం : ఎస్.వెంకటేశ్వర్లు ఆస్తి 122'-00", పడమర : పొన్నగంటి లక్ష్మి మరియు ఇతరుల సైట్ 169'.06", ఉత్తరం : వై.రాధాకృష్ణ మూర్తి ఆస్తి 117'.03". పై సరిహద్దుల అవిభక్త మరియు పేర్కొనబడని పరిధి 42 చ.గ.లు. లేదా 35-11 చ.మీ.లు. 2148-55 చ.గ.లు. బి- షెడ్యూల్ : పైన పేర్కొన్న ఎ షెడ్యూల్ లోని 2148-55 చ.గ.లు.లో 42 చ.గ.లు. లేదా 35-11 చ.మీ.లు. తో కన్నా టవర్స్ ఒకటవ అంతస్తులో డబుల్ బెడ్‌రూము ఫ్లాట్ నం.206 1150 చ.అ.లు. (కామన్ ఏరియాతో సహా) హద్దులు : తూర్పు : కామన్ కారిడార్, దక్షిణం : ఓపెన్ టు స్కై, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : ఓపెన్ టు స్కై. ఈ సరిహద్దులతో కన్నా టవర్స్ యొక్క 1వ అంతస్తులో పేర్కొన్న ఫ్లాట్ నం.206 అన్నీ ఫిక్చర్లు మరియు ఫిట్టింగులు తో సౌలభ్య హక్కులు, సాధారణ పార్కింగ్, కామన్ కారిడార్, లిఫ్ట్, డ్రైనేజీ కనెక్షన్ మరియు మొదలైనవి. | స్వాధీనత | రూ.18,50,000/- (పద్దెనిమిది లక్షల యాభై వేల రూపాయలు మాత్రమే) / రూ. 1,85,000/- (ఒక లక్షా ఎనభై ఐదు వేల రూపాయలు మాత్రమే) | 21.08.2024, మ.02.00గం.ల నుండి సా.04.00 గం.ల వరకు (ప్రతి ఒక్కటి 5 నిమిషాల అపరిమిత పొడిగింపులు టెండర్ పత్రం యొక్క నిబంధనలు) |

1. తనిఖీ తేదీ మరియు సమయం: 19.08.2024, ఉ.11.00గం.ల నుండి సా.4.00గం.ల మధ్య. 2. కనిష్ట బిడ్ ఇంక్రిమెంట్ మొత్తం: 10,000/-
3. బిడ్ /ఇఎమ్‌డి/ పాల్గొనడం కొరకు అభ్యర్థన లేఖ సమర్పణ కొరకు చివరి తేది : 20.08.2024, సా 05.00గం.లకు ముందు

రుణ ఒప్పందం పరంగా వర్తించే తదుపరి వడ్డీతో కలిపి, యాదృచ్ఛిక ఖర్చులు, ఖర్చులు, ఛార్జీలు మొదలైనవి చెల్లింపు తేదీ వరకు చెల్లింపు మరియు/లేదా దాని అమలు ఆస్తి తనిఖీకి సంబంధించిన ఏదైనా సహాయం కోసం లేదా బిడ్ పత్రాన్ని పొందడం కోసం మరియు ఏదైనా ఇతర ప్రశ్నల కోసం దయచేసి **చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క అఫీషియల్ **శ్రీ.రాజోలు సాయి కిషోర్**, అతని **మొ.నం.9603972369**, ఇ మెయిల్ ఐడి : **rajolusai@chola.murugappa.com** / **శ్రీ. మహ్మద్ అబ్దుల్ క్వావి, మొ.నం.7305990872** ద్వారా సంప్రదించవచ్చు. చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారి జ్ఞానం మరియు సమాచారం ప్రకారం పైన పేర్కొన్న స్థిరాస్తులు/సెక్యూర్డ్ అసెట్స్‌కు సంబంధించిన భారాలు లేవు.

తేది: 02.08.2024
ప్రదేశం: గుంటూరు, ఆంధ్రప్రదేశ్
సం/-
అధీకృత అధికారి,
చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్., తరపున

ప్రజాశక్తి
www.prajasakti.com



## ముందస్తు హెచ్చరికలు తూచ్..

# అమిత్ షా మాటలన్నీ అసత్యాలే

- ఐఎండి డేటా విశ్లేషణతో బయటపడ్డ మోడీ సర్కార్ బండారం
- జాతీయ విపత్తుగా ప్రకటించకుండా మోసం

**న్యూఢిల్లీ :** కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి వందలాది మంది సజీవ సమాధి అయిన విషాద ఘటన నేపథ్యంలో కొండచరియల విపత్తుల గురించి ముందుగానే కేరళను హెచ్చరించామంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బిజెపి నేతలు పార్లమెంటు లోపల, వెలుపలా చెబుతున్నవన్నీ అసత్యాలేనని తేలిపోయింది. ఇటువంటి ప్రమాదాలు సంభవించే అవకాశాలపై ముందుగానే హెచ్చరించే వ్యవస్థలు దేశంలో ఎలా పనిచేస్తున్నాయో అవి కేరళ ప్రభుత్వాన్ని ఎలా అప్రమత్తం చేశాయో షా వివరించినతీరు అసాంతం పచ్చి బూటకమని స్పష్టమైంది. భారత వాతావారణ శాఖ (ఐఎండి) డేటా విశ్లేషణలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విపత్తు సమయంలోనూ ఎంతటి మోసానికి తెగబడిందో ఇట్టే అర్థమవుతుంది. విపత్తు ముందు, తర్వాత ఐఎండి జారీ చేసిన హెచ్చరికలు ఏమిటీ? అమిత్ షా చెబుతున్న మాటల్లో నిజమెంత? అనే అంశాలను నిగ్గు తేల్చుతూ వాతావారణ రంగ నిపుణుల విశ్లేషణలతో ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'ద హిందూ' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఆ వివరాలు..

**అమిత్ షా చెప్పిందేమిటీ?**

"కేరళ పశ్చిమ తీర ప్రాంతంలో సాధారణం కన్నా అధికంగా వర్షపాతం పడుతుందని జులై 18న హెచ్చరికలు జారీ అయ్యాయి. జులై 23న భారీ నుండి అతి భారీ వర్షాలు పడతాయని మళ్ళీ హెచ్చరికలు వెలువడ్డాయి. జులై 25న మరింత నిర్దిష్టంగా ఈ హెచ్చరిక జారీ అయింది." అని షా లోక్‌సభలో చెప్పారు.

**ఐఎండి చెప్పిందేమిటీ?**

జులై 19 ఉదయం 11.30గంటల లోపు కేరళలోని ఉత్తర ప్రాంతాల్లో ఆకస్మిక వరద ముప్పు అవకాశం వుందంటూ జులై 18న భారత వాతావరణ శాఖ (ఐఎండి) ఒక ప్రకటన జారీ చేసింది. అదే రోజు మరో హెచ్చరిక జారీ చేస్తూ జులై 18 నుండి 31 వరకు మరిన్ని ప్రాంతాలకు ఈ ముప్పు పొంచి వుందని పేర్కొన్నారు. అయితే అందులో ఎక్కడా కూడా కేరళ పేరును ప్రత్యేకంగా ప్రస్తావించలేదు.

- కేరళలో 25వ తేదీన అక్కడక్కడా భారీ నుండి అతి భారీ వర్షాలు పడే అవకాశం వుందంటూ (చర్యలకు సూచిస్తూ) జులై 23న ఐఎండి మరో పత్రికా ప్రకటన జారీ చేసింది. జులై 23-27 మధ్య కాలంలో కేరళ, మహే (పుదుచ్చేరి)ల్లో కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షపాతం నమోదు కావచ్చని పేర్కొంది. ఈ ముందస్తు హెచ్చరికల పేరుతో సబ్ డివిజన్‌ల వారీగా వాతావరణ హెచ్చరికలు చేస్తూ కేరళకు జులై 25కి ఆరంజ్ అలర్ట్ జారీ చేశారు.
- జులై 23, 24, 26, 27 తేదీల్లో ఎల్లో వాచ్ అలర్ట్ జారీ చేశారు. ఎల్లో అలర్ట్ జారీ చేయడమంటే నిర్దిష్టంగా కార్యచరణ చేపట్టాలని పిలుపివ్వడం కాదు.

"చెదురు మదురుగా నుండి విస్తృతంగా, తేలిక పాటి నుండి ఒక మోస్తరు వర్షపాతం, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షపాతం రాబోయే ఐదు రోజుల్లో కేరళ, మహే, ఇతర ప్రాంతాల్లో పడే అవకాశం వుంది. జులై 25-29 మధ్య కాలంలో కేరళ, మహేల్లో అక్కడక్కడా భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం వుందని హెచ్చరిస్తూ జులై 25న జారీ చేసిన పత్రికా ప్రకటన పేర్కొంది. దృశ్యరూపంలో జారీ చేసిన హెచ్చరికల్లో కూడా కేరళకు ఎల్లో అలర్ట్ చూపించారు. జులై 25 నుండి ఆగస్టు 7 వరకు ఇదే తరహాలో పరిస్థితి వుండవచ్చని కూడా హెచ్చరించారు.

- జులై 29న కేరళ, మహేల్లో అక్కడక్కడా అతి భారీ వర్షాలు పడే అవకాశం వుందంటూ ఐఎండి ఆరంజ్ అలర్ట్ జారీ చేసింది. జులై 30 తెల్లవారు జామునే కొండచరియలు విరిగి పడి వందలాదిమంది మరణించారు.
- కొండచరియలు విరిగిపడిన తర్వాతే, జులై 30కి రెడ్ అలర్ట్ జారీ చేస్తూ 1.10గంటల సమయంలో పత్రికా ప్రకటన చేశారు. ఈ పత్రికా ప్రకటనలో కూడా జులై 31, ఆగస్టు 1వ తేదీలకు కేరళ, మహేలకు ఆరంజ్ అలర్ట్ జారీ చేశారు.
- భారీ వర్షాలు పడి, కొండచరియలు విరిగిపడిన రోజు జులై 30న వయనాడ్ జిల్లాలో 15మిల్లీమీటర్ల వర్షపాతం పడుతుందని పేర్కొంటూ జులై 23న ఒక ఫోర్‌కాస్ట్ జారీ చేశారు. ఐఎండి పూనే వ్యవసాయ వాతావరణ విభాగం ఈ అంచనాలను జారీ చేసింది. ఐఎండి వర్గీకరణ ప్రకారం 15మి.మీ వర్షపాతం అంటే అది ఆందోళన చెందే అంశమే కాదు.
- కేరళకు సాధారణ వర్షపాతాన్ని మించి అతి భారీ వర్షాలు పడే అవకాశం వుందని తిరువనంతపురంలోని ఐఎండి కేంద్రం జులై 25న మరో హెచ్చరిక జారీ చేసింది. జులై 26 నుండి ఆగస్టు 1 మధ్యలో ఈ పరిస్థితి సంభవించే అవకాశం వుందని పేర్కొంది. అంతేకానీ ఆందోళనలు చెందే అవకాశాల గురించి హెచ్చరించలేదు. ఆగస్టు 2 నుండి 8 వరకు రాష్ట్రంలో సాధారణ వర్షపాతం నమోదవుతుందని కూడా అంచనా వేసింది.
- జులై 26న తిరువనంతపురం వాతావరణ కేంద్రం జారీ చేసిన అంచనాల ప్రకారం జులై 30న వయనాడ్ జిల్లాలో తేలిక పాటి నుండి ఒక మోస్తరు వర్షపాతం నమోదువుతుందని పేర్కొంది.
- కానీ 20సెంటిమీటర్లకు మించి వర్షపాతం, కొండచరియలు విరిగిపడే అవకాశం వుందని జులై 26నే కేరళకు హెచ్చరికలు జారీ చేశామని అమిత్ షా రాజ్యసభలో చెప్పారు. కానీ ఐఎండి ఆ రోజు జారీ చేసిన ప్రకటనలో అటువంటి హెచ్చరికలేమీ లేవు.

**సాక్ష్యాధారాలతో తిప్పికొట్టిన కేరళ ముఖ్యమంత్రి**

షా వ్యాఖ్యల నేపథ్యంలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మాట్లాడుతూ, కొండచరియలు విరిగిపడే అవకాశాల గురించి అలర్ట్‌లు జారీ చేసే బాధ్యత కలిగిన జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, నదుల వరదలకు సంబంధించి అలర్ట్‌లు జారీ చేసే కేంద్ర జల సంఘం, ఐఎండి ఇవేవీ కూడా ఎలాంటి హెచ్చరికలు జారీ చేయలేదని స్పష్టం చేశారు. పైగా వయనాడ్ జిల్లాకు ఎక్స్‌పెరిమెంటల్ రెయిన్‌ఫాల్ ఇండ్యూస్డ్ లాండ్‌స్లైడ్ ఫోర్‌కాస్ట్ బులెటిన్" అన్న టైటిల్‌ను కూడా ఆయన షేర్ చేశారు. రెండు రోజుల కోసం దీన్ని జులై 29న జారీ చేశారు. కొండచరియలు విరిగిపడే అవకాశాలు చాలా తక్కువగా వున్నాయని ఆ బులెటిన్ అంచనా వేసింది. అమిత్ షా ప్రకటన నేపథ్యంలో ఈ సమాచారాన్ని ప్రస్తుతం పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో లేకుండా చేశారు.

**సహాయ వ్యవస్థలపైనా అసత్యాలే**

పైగా లోక్‌సభలో అమిత్ షా మాట్లాడుతూ, 2014కు ముందు, ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలు, సహాయక, పునరావాస చర్యలకు స్పందించేందుకు ఒకే ఒక వ్యవస్థ వుండేందని చెప్పారు. కానీ అది నిజం కాదు. భారతదేశం 2012లో నేషనల్ మాన్‌సూన్ మిషన్‌ను ఏర్పాటు చేసింది. దేశ రుతుపవనాలకు సంబంధించిన అంచనాలను మరింత మెరుగైన రీతిలో ఇచ్చేందుకు దీన్ని రూపొందించారు. 2017లో ఈ మాన్‌సూన్ మిషన్ మొదటి దశ పూర్తయింది. రెండో దశ కూడా ప్రారంభమైంది. వ్యవసాయం, ఇంధన,. జల వనరుల రంగాల్లో రుతుపవనాల అంచనాల ఆధారంగా వాతావరణ తీవ్రతలను అంచనా వేసేందుకు రెండో దశ ను కూడా 2017లో ప్రారంభించారు.

### ఐఎండి ఏం చెప్పింది

**వయనాడ్ జిల్లా కోసం జులై 29న విడుదల చేసిన కొండచరియలు ముందస్తు హెచ్చరికలో కొండచరియలు విరిగే పడే అవకాశాలు తక్కువగా ఉన్నట్లు తెలిపారు**

మొదటి రోజు : (జులై 29 మధ్యాహ్నం 2:30 గంటల నుంచి జులై 30 మధ్యాహ్నం 2:30 గంటల వరకు)

రెండో రోజు : (జులై 30 మధ్యాహ్నం 2:30 గంటల నుంచి జులై 31 మధ్యాహ్నం 2:30 గంటల వరకు)




| అంచనా స్థాయి | వివరణ |
|---|---|
| అత్యంత తీవ్రం | విస్తారంగా అనేక ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడే అవకాశాలు అతి తీవ్రంగా ఉంటుంది |
| తీవ్రం | స్థానికంగా ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడే అవకాశాలు ఎక్కువగా ఉంటుంది |
| మోస్తారు | పరిమితమైన ప్రాంతాల్లో కొండచరియులు విరిగిపడే అవకాశాలు ఒక మోస్తారుగా ఉంటాయి |
| తక్కువ | చిన్న పరిణామంలో కొండచరియలు విరిగిపడే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. |

## దాడులకు మళ్లీ సిద్ధమైన ఇడి

- ప్రతిపక్షనేత రాహుల్ ట్వీట్

**న్యూఢిల్లీ :** లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రముఖ సామాజిక మాధ్యమం ఎక్స్ (గతంలో ట్విట్టర్)లో చేసిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. తనపై త్వరలోనే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దాడులు జరగొచ్చని ఆయన తెలిపారు. ఇడి సోదాలపై తనకు విశ్వసనీయ వ్యక్తుల ద్వారా సమాచారమందిందని ట్వీట్ చేశారు. లోక్‌సభలో తాను చేసిన చక్రవ్యూహం ప్రసంగం కొంతమందికి నచ్చలేదని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో త్వరలో తనపై ఇడి దాడులు జరగొచ్చని ఆయన పేర్కొనడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. "ఇడి మళ్లీ సోదాలకు సిద్ధమవుతున్నది. ఇడిలో పనిచేస్తున్న కొందరు విశ్వసనీయ అధికారులే ఈ విషయం చెప్పారు. గత నెల 29న 'చక్రవ్యూహం' ప్రసంగం సాధారణంగానే ఇద్దరిలో ఒకరికి నచ్చలేదు. ఇడి అధికారులను సోదాలకు ఆహ్వానించేందుకు చాయ్, బిస్కెట్లతో సిద్ధంగా ఉన్నాను" అని రాహుల్ ట్విటర్‌లో పేర్కొన్నారు.

## 4.43 కోట్ల 'ఉపాధి' కార్డుల తొలగింపు

- రాష్ట్రంలో 35.54 లక్షల కోత

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

గ్రామీణ ప్రాంతాలకు కొండంత భరోసాగా నిలుస్తున్న జాతీయ ఉపాధి హామీ పథకంపై బిజెపి అధికారంలోకి వచ్చిననాటి నుంచి కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. బడ్జెట్‌లో పదేపదే కోతలు విధిస్తూ వస్తున్న మోడీ సర్కార్ అనేక ఆంక్షలు, షరతులతో ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తూ వస్తోంది. గడిచిన ఐదున్నరేళ్లలో దేశవ్యాప్తంగా 4.5 కోట్ల కుటుంబాలను ఈ పథకం నుంచి దూరం చేసింది. రాజ్యసభలో అడిగిన ఒక ప్రశ్నకు బదులిస్తూ కేంద్ర గ్రామీణాభివద్ధి శాఖ మంత్రి కమలేష్ పాశ్వాన్ ఈ విషయం చెప్పారు. ఐదున్నరేళ్లలో 4,43,04,661 జాబ్ కార్డులు తొలగించినట్లు పేర్కొన్నారు. 2019-20లో 14,33,431, 2020-21లో 27,97,013, 2021-22లో 50,39,649, 2022-23లో 2,25,38,538, 2023-24లో 1,02,71,048, 2024-25 (ఇప్పటి వరకు)లో 22,24,982 ఉపాధి హామీ జాబ్ కార్డులు తొలగించినట్లు ఆయన తెలిపారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో 2019-20లో 24,613, 2020-21లో 3,426, 2021-22లో1,85,096, 2022-23లో 28,87,981, 2023-24లో 3,70,459, 2024-25 (ఇప్పటి వరకు)లో 82,618 ఉపాధి హామీ జాబ్ కార్డులు తొలగించినట్లు పేర్కొన్నారు. మొత్తంగా ఐదున్నరేళ్లలో ఏపిలో 35,54,193 జాబ్ కార్డులకు కోత పెట్టారు. తెలంగాణలో ఇదేకాలంలో 6,75,511 జాబ్ కార్డులు తొలగించారు.

**ఎరువుల సబ్సిడీలపైనా కోత**

రైతుల ఎరువుల సబ్సిడీ తగ్గుతుంది. లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన లెక్కల ప్రకారం ఎరువుల సబ్సిడీ తగ్గుదలను స్పష్టం చేస్తుంది. 2022-23లో రూ.2,54,798.9 కోట్ల ఎరువుల సబ్సిడీ ఇవ్వగా, 2023-24 నాటికి రూ. 1,95,420.51 కోట్లకు తగ్గింది. అంటే రూ.59,378.39 కోట్లు తగ్గింది. 2024-25 (జూలై 22) రూ.36,993.39 కోట్లకు తగ్గింది.

# ప్రాణాలు కాపాడిన పాఠశాల

**వయనాడ్ :** ఇటీవలే నిర్మించిన ప్రభుత్వ హయ్యర్ సెకండరీ పాఠశాల భవనం కేరళలోని వయనాడ్‌లో చోటుచేసుకున్న ప్రకృతి విలయం నుండి పలువురిని కాపాడింది. కొండచరియలు విరిగిపడిన సంఘటనలో తీవ్రంగా నష్టపోయిన ముండక్కైకి సమీపంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. పాఠశాల భవనంలో బిక్కుబిక్కుమంటూ తలదాచుకున్న దాదాపు పది మందిని రక్షణ బృందాలు శుక్రవారం రక్షించి బయటకు తీసుకువచ్చాయి.ప్రాణాలతో బయటపడిన శ్యాంసీర్ మాట్లాడుతూ మంగళవారం రాత్రి కొండ చరియలు విరిగిపడటంతో అందరిళ్లతో పాటు, తన ఇల్లు కూడా జలమయమైనట్లు చెప్పాడు.' ఇరుగుపొరుగు వారు వచ్చి తలుపులు తెరవడంతో నా తండ్రి, తల్లి, భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి రోడ్డుమీదకు వచ్చాను. అంతలోకే రెండవసారి కొండచరియలు విరిగాయి. బురదనీరు శరవేగంగా వస్తున్నాయి. ఏవ చేయాలో అర్థం కాక అందరం కొండవైపు పరిగెత్తాం. మా కళ్ల ముందే మా ఇళ్లు క్షణాల్లోనే బురదనీటి కిందకు వెళ్లిపోయింది. కొండ గట్టున కొత్తగా కట్టిన పాఠశాలలోకి అందరంచేరాం.

కాసేపటికే కొట్టుకొచ్చిన చెట్లు, రాళ్లతో పాఠశాల గేటు నిండిపోయింది. మేం పై అంతస్తుకు వెళ్లాం. బురదనీరు, కొట్టుకొచ్చిన చెట్లు అక్కడదాకా వచ్చాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఇన్ని రోజులు గడిపాం.' అని ఆయన వివరించారు. వీరికి రక్షణ ఇవ్వడంతో పాటు ఈ పాఠశాల భవనం కొట్టుకొచ్చిన చాలా కొండ రాళ్లను, చెట్లను అడ్డుకుంది.లేనిపక్షంలో ఇవి చురల్మల పట్టణంలోకి చేరి మరింత విధ్వంసం సృష్టించి ఉండేవి. అయితే, వరద, బురద మట్టికి పాఠశాల భవనంలోని కొంత భాగం పూర్తిగా ధ్వంసమైంది.

## నీట్, ఎన్‌టిఎను రద్దు చేయాలి

- రాష్ట్ర జాబితాలో విద్యను చేర్చాలి
- రాజ్యసభలో ప్రైవేట్ మెంబర్ బిల్లు

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

విద్యను ఉమ్మడి జాబితా నుంచి తొలగించి రాష్ట్ర జాబితాలో చేర్చే చట్టం తీసుకురావాలని, నీట్, ఎన్‌టిఎలను రద్దు చేసి రాష్ట్రాలు మెడికల్ ఎంట్రన్స్ పరీక్షలు నిర్వహించేందుకు అనుమతించాలని కోరుతూ రాజ్యసభలో ప్రతిపక్ష సభ్యులు ప్రైవేట్ మెంబర్ బిజినెస్ బిల్లును ప్రవేశపెట్టారు. తమిళనాడుకు చెందిన డిఎంకె సభ్యుడు ఎం మహమ్మద్ అబ్దుల్లా అధికార ఎంపిల వ్యతిరేకత మధ్య నీట్ అంశం సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధమని పేర్కొన్నారు. నీట్ పరీక్షతో ప్రభావానికి గురైన బాధిత కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారాన్ని అందించాలని కోరారు. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ అడిగిన తరువాత అబ్దుల్లా తీర్మానాన్ని ప్రవేశపెట్టడానికి ముందే, విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి జోక్యం చేసుకుని ప్రైవేట్ మెంబర్ బిల్లు "పార్లమెంటరీ నిబంధనలు" విరుద్ధంగా ఉందని అన్నారు. బిజెపికి చెందిన ఘనశ్యామ్ తివారీ కేంద్ర మంత్రితో ఏకీభవించారు. ఈ అంశంపై చర్చ సుప్రీంకోర్టును ధిక్కరించినట్లేనని అన్నారు. సిపిఎం ఎంపిలు జాన్ బ్రిట్టాస్, వి.శివదాసన్, ఆప్‌కి చెందిన రాఘవ్ చద్దా, కాంగ్రెస్‌కు చెందిన శక్తిసిన్హ్‌గోహిల్‌లతో సహా పలువురు ప్రతిపక్ష సభ్యులు చైర్మన్ ఆమోదించిన తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టడానికి అనుమతించకపోవడం సభ్యుని హక్కు ఉల్లంఘన అవుతుందని వాదించారు. దీంతో బిల్లును ప్రవేశపెట్టాలని అబ్దుల్లాను డిప్యూటీ చైర్మన్ కోరారు.

## ఇసుక అక్రమ తవ్వకాలపై విచారణ 31కు వాయిదా

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

గత ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలపై విచారణను సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. ఇసుక అక్రమ తవ్వకాలపై ఏపి ప్రభుత్వం, కేంద్ర అటవీ పర్యావరణ శాఖ తాజా నివేదికలతో అఫిడవిట్ దాఖలు చేసింది. దీంతో మే 9న దాఖలు చేసిన అఫిడవిట్‌కి, తాజా అఫిడవిట్‌కి చాలా వ్యత్యాసం ఉందని దండా నాగేంద్ర కుమార్ తరపు న్యాయవాది తెలిపారు. ఇసుక అక్రమాల వ్యవహారం గతంలో జియాలజీ, మైనింగ్ డైరెక్టర్‌గా వ్యహరించిన అధికారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కోర్టుకు ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. ఇసుక అక్రమ తవ్వకాలపై షోకాజ్ నోటీసులు, ఎఫ్ఐఆర్‌ల నమోదు చేయడంతోపాటు, తీసుకున్న చర్యలను అఫిడవిట్‌లో చెప్పినట్లు న్యాయవాదులు పేర్కొన్నారు. వర్షాల కారణంగా అక్రమ తవ్వకాల ఆనవాళ్లు తొలిగిపోయినందున, శాస్త్రీయ పద్ధతిలో ఆధారాలు సేకరణకు ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పిన రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. శాస్త్రీయ పద్ధతిలో ఆధారాలు సేకరించడానికి కనీసం మూడు వారాలు పడుతుందని ప్రభుత్వ న్యాయవాది పేర్కొన్నారు. తాము ఇప్పటికే 8 జిల్లాల్లో తనిఖీలు జరిపినట్లు సుప్రీంకోర్టుకు కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ తెలిపింది. తమ తనిఖీల్లో తేలిన విషయాలన్నీ కోర్టు ముందు ఉంచినట్లు చెప్పిన అదనపు సోలిసిటర్ జనరల్ అన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో ఇసుక తవ్వకాల్లో కీలక పాత్ర పోషించిన జెపి వెంటర్స్ సంస్థను మాత్రం వదిలిపెట్టవద్దని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. తమపై విధించిన జరిమానా రూ. 18 కోట్లపై విచారణ జరపాలని జెపి సంస్థ తరపు న్యాయవాదులు కోరారు. ఇప్పుడు కాదని, దానిపై నిర్ణయం తీసుకునే ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాఖలు చేసిన అఫిడవిట్ల ను పరిశీలించాల్సి ఉందని జస్టిస్ అభయ్ ఎస్ ఒఖా ధర్మాసనం పేర్కొంది. అనంతరం తదుపరి విచారణను ఆగస్టు 31కి వాయిదా వేసింది. ఈ లోగా మిగిలిన వివరాలు కూడా కోర్టు ముందు ఉంచాలని ఆదేశించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సప్లిమెంటరీ అఫిడవిట్ దాఖలు చేసేందుకు ధర్మాసనం అనుమతించింది.

# హనియెకు కన్నీటి వీడ్కోలు

**దోహాలో ముగిసిన అంత్యక్రియలు**

**దోహా, గాజా :** ఇజ్రాయిల్ మిలటరీ దాడిలో మరణించిన హమాస్ అగ్ర నేత హనియె అంత్యక్రియలు శుక్రవారం దోహాలో జరిగాయి. వేలాదిమంది ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. లూసాయ్ రాయల్ శ్మశాన వాటికలో ఆయన భౌతిక కాయాన్ని ఖననం చేశారు. ఈ కార్యక్రమానికి బయటివారినెవరినీ రానివ్వలేదు. కొంతమంది ప్రభుత్వ ప్రముఖులు, ఖతార్ రాజ కుటుంబానికి చెందిన సభ్యులు కొంతమంది, హనియె కుటుంబ సభ్యులు కొద్ది మంది మాత్రమే హాజరయ్యారు. గత పది మాసాలుగా కొనసాగుతున్న ఇజ్రాయిల్ దాడుల్లో హనియె 12మంది కుటుంబ సభ్యులను కోల్పోయారు. ఫతా, హమాస్, ఇస్లామిక్ జిహాద్ వంటి పాలస్తీనాకు చెందిన వివిధ వర్గాల నేతలు, ప్రవాసంలో వుంటున్న ముఖ్యమైన పాలస్తీనా నేతలు కొంతమంది ఈ కార్యక్రమానికి విచ్చేశారు. పాలస్తీనా ప్రతిఘటన ఉద్యమానికి కీలకంగా హనియెను భావిస్తున్నందువల్ల డజన్ల సంఖ్యలో ఎన్‌జిఓల ప్రతినిధులు కూడా వచ్చారు. పాలస్తీనియన్ల తరపున చట్టబద్ధమైన వాణిని వినిపించేది హనియె అని వీరందరూ విశ్వసిస్తున్నారు. సామాన్యుల నుండి రాజకీయ నేతలు, సామాజిక కార్యకర్తల వరకు పలు వర్గాలకు చెందినవారు వచ్చి హనియెకు నివాళి అర్పించారు. అత్యధిక ఎండలతో వాతావరణం ప్రతికూలంగా వున్నప్పటికీ వేలాదిమంది ప్రజలు దోహాలో అబ్దుల్‌అల్ వహాబ్ మసీదు వద్దకు చేరి తమ నేతకు నివాళి అర్పించారు. "ఆయన చనిపోతే, మొత్తంగా వ్యవస్థ మరణించినట్లు కాదు." అని వ్యాఖ్యానించారు. గాజాలో చిక్కుకుపోయి ఇబ్బందులు పడుతున్న వారికి మద్దతుగానే తామిక్కడకు వచ్చినట్లు మరొకరు వ్యాఖ్యానించారు. హనియె ఒక ఆశాకిరణమని కొనియాడారు. పాలస్తీనియన్లకు ఈ రకంగా సంఘీభావం తెలియచేస్తున్నామని పేర్కొన్నారు.

## ఎలక్టోరల్ బాండ్లపై సిట్ విచారణ

# ఈ దశలో సాధ్యం కాదు : సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ :** ఎన్నికల బాండ్ల వ్యవహారంపై విచారణ కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసేందుకు సుప్రీంకోర్టు శుక్రవారం నిరాకరించింది. అపరిపక్వదశలో విచారణ అనుచితమని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఎన్నికల బాండ్ల వ్యవహారంలో రాజకీయ పార్టీలకు, ప్రభుత్వ అధికారులకు, కంపెనీల మధ్యనే కాకుండా చట్టాలను అమల్జేయాల్సిన ఏజెన్సీల మధ్య కూడా క్విడ్ ప్రోకో (మీకు ఇది - మాకు అది) అక్రమాలు జరిగివుంటాయని వస్తున్న కథనాలపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేసి విచారణ జరిపించాల్సిందిగా విన్నవిస్తూ కామన్‌కాజ్, సెంటర్ ఫర్ పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ (సిపిఐఎల్) స్వచ్ఛంద సంస్థలతో పాటు పలువురు దాఖలు చేసిన పిటిషన్లను ఒకే బంచ్‌గా ధర్మాసనం విచారణ చేపట్టింది.

ఫిర్యాదిదారుల పక్షాన ప్రశాంత్ భూషణ్, నేహా రతి, చెర్యాల్ డి సౌజా వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా రెండు ప్రాథమిక అంచనాలను వారు ప్రస్తావించారు. అందులో మొదటిది.. కొన్ని కంపెనీలు అధికార పక్షానికి ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసి విరాళంగా అందజేసిన తేదీ ఏదైతే ఉందో..అదే సమయంలోనే సదరు కంపెనీలకు అనుకూలించేవిధంగా ప్రభుత్వ విధానాల్లో మార్పుచేర్పులు చేయడం కానీ, లేదా కాంట్రాక్టులు మంజూరు చేయడం కానీ జరిగాయని, ఇది క్విడ్ ప్రోకో వ్యవహారంగానే కనిపిస్తోందని తెలిపారు. రెండోది, దర్యాప్తు సంస్థలకు చెందిన కొందరు అధికారులకు కూడా ఈ అవినీతి వ్యహారంలో ప్రమేయమున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోందని, అందువల్ల అదే అధికారులతో ఈ వ్యవహారంలో విచారణ చేపట్టడం సబబుగా ఉండదని, సిట్ ద్వారానే విచారణ జరిపించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) పాలకపక్ష అవినీతికి ఉపకరణాలుగా మారిపోయానని తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల బాండ్లు కొనుగోలు చేయగానే అప్పటి వరకు సదరు కంపెనీలపై సాగుతున్న ఇడి, సిబిఐ దర్యాప్తులు ఉన్నఫలంగా ఆగిపోయిన సందర్భాలను ఈ సందర్భంగా పిటిషనర్లు ఉదహరించారు.

ప్రధానన్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ ఈ దశలో జోక్యం చేసుకుంటూ 'అయితే ఇవన్నీ కూడా ఈ దశలో అంచనాలే కదా' అని సందేహం వ్యక్తం చేశారు. ఈ దశలో పిటిషనర్లు వ్యక్తపర్చిన రెండు అంచనాలు అపరిపక్వమైనవని, అందువల్ల సిట్ ఏర్పాటు అనుచితమని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల బాండ్ల వ్యవహారంలో నేరాలకు అవకాశముందని ఫిర్యాదీదారులు వాదిస్తున్నందున ..వారి వద్ద ఏవైనా నిర్ధిష్ట ఆధారాలు ఉంటే క్రిమినల్ చట్టాల ప్రక్రియలోని సాధారణ పరిష్కార మార్గాలను ఆశ్రయించవచ్చునని, ఒకవేళ ఏజెన్సీ సంస్థలు విచారణకు నిరాకరిస్తే అప్పుడు ఆర్టికల్ 226 కింద రాష్ట్రాల హైకోర్టుల్లోనూ వ్యాజ్యాలు దాఖలు చేయవచ్చునని జస్టిస్ చంద్రచూడ్ సూచించారు. ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని ఈ ఏడాది ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సంచలనాత్మక తీర్పు వెలువరించిన సంగతి విదితమే.

## కోచింగ్ సెంటర్ల నుంచి భారీగా జిఎస్‌టి వసూళ్లు

- రూ.2,240 కోట్ల నుంచి రూ.5,517 కోట్లకు పెరుగుదల
- ఐదేళ్లలో రెట్టింపు : కేంద్రం

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా అనేక కోచింగ్ సెంటర్లు అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్నా..వాటిపై చర్య తీసుకోవటానికి ప్రభుత్వాలు ఆసక్తి చూపటంలేదు. ఇటీవల ఢిల్లీలో సివిల్స్ చదువుకోవటానికి వెళ్లి ముగ్గురు చనిపోయిన విషయం విదితమే. అయితే శవాలపై పేలాలు ఏరుకున్నట్టు కేంద్రం తీరు కనిపిస్తోంది. యువత చనిపోయినప్పుడు చూసుకుందాం..మా ఖజానా నిండుతున్నారా..లేదా అన్నట్టుగా జిఎస్‌టి వసూళ్లు భారీగా పెరిగాయి. గత ఐదేళ్లలో ఇవి రెట్టింపయ్యాయి. 2019-20లో కోచింగ్ సంస్థల నుంచి జిఎస్‌టి వసూళ్లు రూ. 2,240.73 కోట్లుగా ఉండగా.. 2023-24లో రూ. 5,517.45 కోట్లకు పెరిగింది. ఆర్థిక మంత్రిత్వ శాఖ రెవెన్యూ విభాగం డేటాను ప్రస్తావిస్తూ విద్యాశాఖ సహాయమంత్రి సుకాంత మజుందార్ వివరించారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానంగా ఈ సమాచారాన్ని వెల్లడించారు. ఈ డేటా ప్రకారం.. కోచింగ్ సెంటర్ల నుంచి జిఎస్‌టి వసూళ్లు గత ఐదేండ్లలో రెట్టింపయ్యాయి. 2020-21లో అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే రూ. 2,215.24 కోట్లకు స్వల్ప తగ్గుదల కనిపించింది. జిఎస్‌టి వసూళ్లు 2021-22లో రూ. 3,045.12 కోట్లకు, 2022-23లో 4,667.03 కోట్లకు ఎగబాకాయి. కోచింగ్ పరిశ్రమ దేశంలో పెద్ద ఎత్తున ఉన్నదనీ, అది వేగంగా విస్తరిస్తున్నదని కేంద్ర మంత్రి తెలిపారు.

ఇటీవల ఢిల్లీలోని కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లో వరదనీరు వచ్చి ముగ్గురు యూపీఎస్సీ అభ్యర్థులు మరణించిన నేపథ్యంలో, కోచింగ్ సెంటర్లు, వాటికి సంబంధించిన సమస్యలపై పార్లమెంట్‌లో ప్రభుత్వం స్పందిస్తూ.. కేంద్రం మార్గదర్శకాలను జారీ చేసిందని వివరించింది. దేశంలోని ప్రయివేటు కోచింగ్ సెంటర్‌లలో పెరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలు, అగ్ని ప్రమాదాలు, సౌకర్యాలు, బోధనా పద్ధతుల్లో లోపాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వాటి పనితీరుపై నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశారా అనే మరో ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానమిచ్చారు. ఈ ఏడాది జనవరిలో జారీ చేసిన మార్గదర్శకాలను మజుందార్ ఎత్తిచూపారు.

## వెనిజులా అధ్యక్ష ఎన్నికలపై ఆడిట్ చేపట్టండి

- న్యాయస్థానాన్ని కోరిన అధ్యక్షుడు నికొలస్ మదురో

**కారకస్ :** వెనిజులా అధ్యక్ష ఎన్నికలపై ఆడిట్ నిర్వహించాల్సిందిగా అధ్యక్షుడు నికొలస్ మదురో వెనిజులా హైకోర్టును కోరారు. ఈ ఎన్నికల్లో తాను సాధించిన విజయంపై అమెరికా అనుకూల ప్రతిపక్ష నేతలు నానా యాగీ చేస్తుండడంతో యావత్ ఎన్నికల ప్రక్రియపై ఉన్నత న్యాస్థానంతో ఆడిట్ చేయించాలని కోరారు. వెనిజులా వ్యవహారాల్లో బయటివారి జోక్యం వుందంటూ క్యూబా నాయకులు విమర్శించారు.. ఆదివారం నాటి ఎన్నికలకు సంబంధించిన ఓట్ల ట్యాలీల షీట్లన్నింటినీ చూపించడానికి యునైటెడ్ సోషలిస్టు పార్టీ ఆఫ్ వెనిజులా కూడా సిద్ధంగా వుందని మదురో విలేకర్లతో మాట్లాడుతూ చెప్పారు. 'న్యాయం కోసం నేనే న్యాయస్థానాన్ని ఆశ్రయించా'నని వ్యాఖ్యానించారు. తనను కోర్టుకు పిలవాలని, ప్రశ్నించాలని, విచారించాలని కోరారు,. తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్ర జరుగుతోందని అన్నారు. వివరంగా ఓట్ల లెక్కింపులను ఎన్నికల అధికారులు ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించగా, సైబర్ దాడులతో సహా జాతీయ ఎన్నికల కౌన్సిల్‌పై అనేక దాడులు జరుగుతున్నాయన్నారు. మదురోకు ప్రధాన ప్రత్యర్థి ఎడ్మండ్ గోంజాలెజ్, ప్రతిపక్ష నేత మరియా కొరినాలు ఎన్నికల ఫలితాలపై విమర్శలు చేశారు. 2018 అధ్యక్ష ఎన్నికలప్పుడు కూడా అమెరికా ఇదే విధమైన పితలాటకం పెట్టింది. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన మదురోను గుర్తించడానికి బదులు జాతీయ అసెంబ్లీ అధ్యక్షుడు జువాన్ గైడోను తాత్కాలిక అధ్యక్షుడిగా గుర్తిస్తున్నట్లు ప్రకటించి ఆతరువాత అభాసుపాలైంది. మదురో ప్రభుత్వాన్ని దెబ్బ తీసేందుకు మరిన్ని ఆర్థిక, వాణిజ్య ఆంక్షలను విధించింది. అమెరికాలోని వెనిజులా ఆస్తులను స్తంభింపజేసింది. వెనిజులాతో అమెరికన్లు కానీ, అమెరికా కంపెనీలు కానీ ఎలాంటి లావాదేవీలు జరపరాదంటూ నిషేధం విధించింది.

**ఓడిపోయిన అభ్యర్థిని విజేతగా గుర్తించిన అమెరికా**

వెనిజులా అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోయిన ప్రతిపక్ష నేత గోంజాలెజ్‌ను విజేతగా గుర్తిస్తున్నట్లు అమెరికా గురువారం ప్రకటించింది. గోంజాలెజ్ అమెరికా, ఇతర పశ్చిమ దేశాల స్పాన్సర్డు అభ్యర్థి అన్న సంగతి తెలిసిందే. మదురో ఎన్నికైనట్లు వెనిజులా జాతీయ ఎలక్టోరల్ కౌన్సిల్ అధిపతి అధికారికంగా ప్రకటించారు. మదురోకు 51.2 శాతం ఓట్లు రాగా, గోంజాలెజ్‌కు 44. 2 శాతం ఓట్లు వచ్చాయి. మదురోకు వచ్చిన వాటికన్నా రెండు రెట్లు అధికంగా తనకు వచ్చాయని గోంజాలెజ్ చెప్పడం, దానిని అమెరికా బలపరచడం అంతా స్క్రిప్టు ప్రకారమే జరుగుతోంది. మదురోను రష్యా, చైనా, క్యూబా, బొలీవియా, హోండూరస్, నికరాగ్వా తదితర దేశాలు అభినందించాయి.

## 5,597 జడ్జి పోస్టులు ఖాళీ

**ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో**

దేశంలోని హైకోర్టు, జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 5,597 జడ్జి పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. లోక్‌సభలో ఒకప్రశ్నకు సమాధానం ఇచ్చారు. హైకోర్టుల్లో 359, జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 5,238 జడ్జి పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. 2024 జూలై 29 నాటికి ఏపి హైకోర్టులో 9, తెలంగాణ హైకోర్టులో 14 న్యాయమూర్తి పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఏపిలో 74, తెలంగాణలో 115 జిల్లా, సబార్డినేట్ జడ్జిల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. దేశంలో సుప్రీం కోర్టు, హైకోర్టులు, జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 5,06,20,772 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.



# వెరైటీగా 'ఇడుపు కాయితం'

తరుణ్ భాస్కర్ లీడ్ రోల్‌లో నటిస్తూ వంశీరెడ్డి దొండపాటి దర్శకత్వంలో తెరకెక్కనున్న యూరో సినిమాస్, డోలాముఖి సబ్‌బ్రస్టాన్ ఫిల్మ్ ప్రొడక్షన్ నం.2 చిత్రం అక్టోబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. బూసం జగన్మోహనరెడ్డి, వేణు ఊడుగుల నిర్మాతలు. ఇడుపు కాయితం పేరుతో తాజాగా మేకర్స్ ఓపెన్ కాస్టింగ్ కాల్‌ని అనౌన్స్ చేసింది. శ్రీనివాస్‌గౌడ్ అనే పాత్రను అతని భార్య శ్రీలత నుంచి విడాకులు తీసుకున్నట్లు సూచించే స్టాంప్ పేపరుతో ఇడుపు కాయితం అంటూ యూనిక్ స్టయిల్‌లో అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని వెరైటీగా డిజైన్ చేశారు.

# స్వామినాథన్‌కు రజనీ ఆతిథ్యం

విజయ్ సేతుపతి హీరోగా, తమిళ దర్శకుడు నిథిలన్ స్వామినాథన్ తెరకెక్కించిన చిత్రం 'మహారాజ'. ఈ సినిమాపై చాలామంది ప్రశంసలు కురిపించారు. విజయ్‌సేతుపతి కెరీర్‌లో 50వ మైలురాయిని అందుకున్న చిత్రంగా రికార్డు క్రియేట్ చేయటంతోపాటుగా బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షాన్ని కురిపించింది. సస్పెన్స్, సెంటిమెంట్‌తో అద్భుతంగా ఈ సినిమాను నిథిలన్ స్వామినాథన్ తన ప్రతిభతో తెరకెక్కించారు. ఈ క్రమంలో తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ కూడా అభినందించారు. తన నివాసానికి ఆహ్వానించి అద్భుతంగా సినిమా తీశారని ప్రశంసించారు. ఆ సమయంలో రజనీతో దిగిన ఫోటోలను దర్శకుడు నిథిలన్ స్వామినాథన్ తన ఎక్స్‌పేజీలో షేర్‌చేశారు.

# కేరళకు సినీ తారల విరాళాలు

కేరళ రాష్ట్రంలో జలప్రళయం సృష్టించిన విపత్తుతో ఇప్పటికే 300 మందికిపైగానే విగత జీవులుగా మారారు. ఇంకా చాలామంది ఆచూకీ లేకుండా పోయింది. ఈ విపత్తులో కేరళను ఆదుకునేందుకు తమవంతు సాయం చేసేందుకు పలువురు సినీ ప్రముఖులు ముందుకు వచ్చారు. సౌత్ ఇండియన్ స్టార్ హీరో మమ్ముట్టి రూ.20 లక్షలు, ఆయన కుమారుడు దుల్కర్ సల్మాన్ రూ.15 లక్షలు కేరళ మంత్రి పి.రాజీవ్‌కు అందజేశారు. ఫహాద్ ఫాజిల్-నజ్రియా దంపతులు కూడా కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.25 లక్షలు విరాళాన్ని అందించారు. హీరోయిన్ రష్మిక మందన్నా రూ.10 లక్షలు, హీరోయిన్ నయనతార, విగ్నేష్ శివన్ దంపతులు రూ.20 లక్షలు విరాళాన్ని ప్రకటించారు. ఇప్పటికే సూర్య, జ్యోతిక, కార్తీ రూ.50 లక్షలు అందించగా, విక్రమ్ రూ.20 లక్షలు ప్రకటించిన విషయం తెలిసిందే.

## ఒలింపిక్ హాకీలో 52ఏళ్ల తర్వాత

# ఆస్ట్రేలియాపై భారత్ గెలుపు

### షూటింగ్‌లో హ్యాట్రిక్ పతకంపై మను భాకర్ ఆశలు • బ్యాడ్మింటన్‌లో లక్ష్యసేన్ నయా చరిత్ర

**పారిస్:** ఒలింపిక్స్‌లో భారత హాకీజట్టు మరో విజయాన్ని సొంతం చేసుకుంది. శుక్రవారం జరిగిన గ్రూప్-బి ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై 3-2గోల్స్ తేడాతో విజయం సాధించింది. దీంతో 52ఏళ్ల హాకీ చరిత్రలో ఒలింపిక్స్‌లో తొలిసారి భారతజట్టు ఆస్ట్రేలియాపై విజయాన్ని నమోదు చేసుకొంది. దీంతో గ్రూప్-ఎలో భారత్ 2వ స్థానంలో నిలిచి క్వార్టర్‌ఫైనల్‌కు చేరింది. గ్రూప్ లీగ్‌లో భారతజట్టు బెల్జియం చేతిలో 2-1 ఓటమి పాలై తేరుకున్న భారత జట్టు శుక్రవారం దుమ్మురేపింది. ఆద్యంతం ఉత్కంఠ రేపిన మ్యాచ్‌లో 3-2తో కంగారులకు భారత్ చెక్ పెట్టింది. తద్వారా 52 తర్వాత ఒలింపిక్స్‌లో ఆసీస్‌పై తొలి విజయం నమోదు చేసింది. 1972 తర్వాత ఆస్ట్రేలియపై భారత్‌కు ఇదే తొలి గెలుపు కావడం గమనార్హం. దీంతో ఒలింపిక్స్‌లో గ్రూప్-బి లీగ్ ముగిసే సరికి భారత్ 5మ్యాచుల్లో 3మ్యాచుల్లో గెలిచి ఒక మ్యాచ్‌ను డ్రా చేసుకొని, 10 పాయింట్లతో 2వ స్థానంలో నిలిచి క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లింది. గ్రూప్-ఎ, బిలలో టాప్-4లో నిలిచిన జట్ల మధ్య క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి.

**25మీ. పిస్టల్ ఫైనల్‌కు మను**

షూటింగ్‌లో భారత్‌కు మరో పతకానికి చేరువైంది. 10మీ. ఎయిర్ పిస్టల్, మిక్స్‌డ్ టీం విభాగాల్లో కాంస్య పతకాలు సాధించిన 22ఏళ్ల మను భాకర్.. శుక్రవారం 25మీ. పిస్టల్ విభాగంలో ఫైనల్‌కు చేరింది. 40మంది షూటర్లు పాల్గొన్న క్వాలిఫికేషన్ రౌండ్‌లో మను 590పాయింట్లతో 2వ స్థానంలో నిలిచింది. హంగేరీకి చెందిన మేజర్(592పాయింట్లు) టాప్‌లో నిలువగా.. తొలి 8స్థానాల్లో నిలిచిన షూటర్ల మధ్య పతకాల పోటీ శనివారం జరగనుంది. ఇక ఆర్చరీ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో సెమీస్‌కు చేరి ఆశలు రేపిన బొమ్మదేవర ధీరజ్-అంకిత భకత్ జోడీ ఓటమిపాలయ్యారు. ప్రపంచ నంబర్‌వన్, దక్షిణ కొరియా జోడీ చేతిలో హోరాహోరీగా సాగిన నాలుగు సెట్ల పోరులో స్పెయిన్ జంటపై గెలుపొందిన ధీరజ్, అంకిత ద్వయం ఫైనల్ బెర్తు మాత్రం సాధించలేకపోయింది. కొరియా జంట చేతిలో 2-6తో భారత్ ఓడింది. అయితే.. భారత జోడికి ఒలింపిక్ మెడల్ గెలిచేందుకు మరో చాన్స్ ఉంది. కాంస్య పతక పోరులో అమెరికా ఆర్చర్ల టీమ్ బ్రాడీ ఎల్లిసన్, కాసే కౌఫ్‌హెూల్డ్‌తో ధీరజ్, అంకిత తలపడనున్నారు. ఎల్లిసన్ ఇప్పటికే మూడు సార్లు ఒలింపిక్ మెడల్ సాధించాడు. ఇక మహిళల సింగిల్స్‌లో కౌఫ్‌హెూల్డ్ ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకర్. దాంతో, ధీరజ్, అంకితలకు గట్టి పోటీ తప్పకపోవచ్చు. ఆర్చరీ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో దక్షిణ కొరియా, జర్మనీ జోడీలు తలపడనున్నాయి.

## రెండో పంచ్‌కే నెగ్గిన ఖెలిఫ్

### లింగ వివక్ష దుమారం

మహిళల 66కిలోల అల్జీరియాకు చెందిన ఇమానె ఖెలెఫ్ రెండో పంచ్‌కే విజయాన్ని సొంతం చేసుకుంది. ఏంజెలా కెరాని(ఇటలీ)తో శుక్రవారం జరిగిన ఈ బౌట్‌లో ఆమె కేవలం 46 సెకన్లలోనే ప్రత్యర్థిని చిత్తుచేసింది. దీంతో ఖెలిఫ్‌పై లింగ విక్ష దుమారం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ బౌట్‌లో ఆమె తొలి పంచ్‌కే ప్రత్యర్థి ముక్కును బలంగా కొట్టింది. దీంతో ఆమె ముక్కు చిట్లడంతో ఇటలీ బాక్సర్ బౌట్‌నుంచి అర్ధాంతరంగా వైదొలిగింది. ఖెలిఫ్‌ను రిఫరీ విజేతగా ప్రకటించిన లింగ వివక్ష కారణంగానే గెలిచిందని ఆరోపణలు వచ్చాయి. న్యూఢిల్లీలో జరిగిన 2023లో జరిగిన వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో ఖెలెఫ్‌పై తొలిసారి లింగ వివాదం మొదలైంది. "తాము మహిళలమని చెప్తూ కొందరు అథ్లెట్లు తమ తోటి క్రీడాకారిణులను మోసగించే యత్నాలను మేం గుర్తించాం. ఇదంతా డీఎన్‌ఏ పరీక్షల తర్వాత వెల్లడిస్తున్నాం. వారిలో ఎక్స్, వై క్రోమోజోములు ఉన్నాయని తేలింది. వారిని ఆట నుంచి మినహాయించాం" అని అప్పుడు ఇంటర్నేషనల్ బాక్సింగ్ అసోషియేషన్(ఐబా) ఒక ప్రకటన విడుదల చేసింది. వైద్యకారణాల వల్ల ఆమె ఆట నుంచి వైదొలిగిందని అప్పటి అల్జీరియన్ ఒలింపిక్ కమిటీ వెల్లడించడం గమనార్హం. అయితే భిన్న నిబంధనలు కలిగిన అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసి) మాత్రం ఖెలిఫ్‌కు ఈ విశ్వక్రీడల్లో పోటీపడే అవకాశం కల్పించింది. ఐబీఏ ప్రకటనపై ఖెలిఫ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. అల్జీరియా గోల్డ్ మెడల్ గెల్చుకోవడం కొన్ని దేశాలకు ఇష్టం లేదని విమర్శించారు.

## బ్యాడ్మింటన్ సెమీస్‌కు లక్ష్యసేన్

బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లోకి 19వ సీడ్ లక్ష్యసేన్ దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో లక్ష్యసేన్ 19-21, 21-15, 21-12తో 12వ సీడ్ ఛో-టిన్-చెన్(చైనీస్ తైపీ) పై పోరాడి నెగ్గాడు. తొలి గేమ్‌ను హోరాహోరీ పోరులో కోల్పోయినా.. రెండు, మూడు గేమ్‌లలో దూకుడుగా ఆడి ప్రత్యర్థిని చిత్తుచేశాడు. దీంతో ఒలింపిక్ బ్యాడ్మింటన్ చరిత్రలో భారత్‌నుంచి సెమీస్‌కు చేరిన తొలి పురుష షట్లర్‌గా లక్ష్యసేన్ రికార్డు పుటల్లోకెక్కాడు. గతంలో మహిళల సింగిల్స్‌లో భారత్‌నుంచి సైనా నెహ్వాల్, పివి సింధు సెమీస్‌కు చేరారు.

## గెలుపునకు చేరువై.. టైతో సరి...

### భారత్-శ్రీలంక తొలి వన్డే

**కొలంబో:** ప్రేమదాస స్టేడియంలో భారత్-శ్రీలంక జట్ల మధ్య జరిగిన తొలి వన్డే టై అయ్యింది. విజయానికి ఒక్క పరుగు చేయాల్సిన దశలో భారతజట్టు వరుసగా రెండు వికెట్లు కోల్పోయి మ్యాచ్‌ను చేజేతులా టైగా ముగించాల్సి వచ్చింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 50 ఓవర్లలో 8 వికెట్లకు 230 పరుగులు చేయగా.. లక్ష్యఛేదనలో టీమిండియా కూడా 47.5ఓవర్లలో 230 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ రోహిత్ శర్మ(58), అక్షర్ పటేల్(33), కేఎల్ రాహుల్(31), శివమ్ దూబే(25), విరాట్ కోహ్లీ(24), శ్రేయాస్ అయ్యర్(23) బ్యాటింగ్‌లో రాణించారు. గెలుపు 18 బంతుల్లో 5 పరుగులు కావాల్సి ఉండగా, చేతిలో రెండు వికెట్లు ఉన్నాయి. క్రీజులో శివమ్ దూబే, సిరాజ్ ఉన్నారు. ఇన్నింగ్స్ 48వ ఓవర్ వేసిన శ్రీలంక కెప్టెన్ చరిత్ అసలంక నాలుగో బంతికి శివమ్ దూబేను అవుట్ చేశాడు. ఆ తర్వాతి బంతికే ఆర్షదీప్‌ను డకౌట్ చేయడంతో టీమిండియా ఇన్నింగ్స్‌కు తెరపడింది. ఈ రెండు వికెట్లను అసలంక ఎల్‌బిడబ్ల్యు ద్వారా సాధించడం విశేషం. శ్రీలంక బౌలర్లలో కెప్టెన్ చరిత్ అసలంక, వనిందు హసరంగకు మూడేసి, దునిత్ వెల్లలాగే, అసిత ఫెర్నాండోకు ఒక్కో వికెట్ దక్కాయి.

టాస్ గెలిచిన ఆతిథ్య జట్టుకు సిరాజ్ షాకిస్తూ ఓపెనర్ అవిష్క ఫెర్నాండో(1)ను వెనక్కి పంపాడు. 7 పరుగులకే తొలి వికెట్ కోల్పోయిన లంకను ఓపెనర్ పథుమ్ నిశాంక(52), కుశాల్ మెండిస్(14) ఆదుకునే ప్రయత్నం చేశారు. రెండో వికెట్‌కు 39 పరుగులు జత చేసిన ఈ జోడిని శివం దూబే విడదీ శాడు. ఆ తర్వాత వచ్చిన సదీర సమరవిక్రమ(8), కెప్టెన్ చరిత అసలంక(14)లు నిరాశపరిచారు. ఆ తర్వాత వెల్లెలగె (67నాటౌట్), హసరంగ(24) బ్యాటింగ్‌లో రాణించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ వెల్లెలగేకు దక్కింది.

### పతకాల పట్టిక(టాప్-10)

| దేశం | స్వ | ర | కా | మొ |
|---|---|---|---|---|
| 1. చైనా | 13 | 7 | 7 | 27 |
| 2. అమెరికా | 9 | 17 | 15 | 41 |
| 3. ఫ్రాన్స్ | 9 | 11 | 11 | 31 |
| 4. బ్రిటన్ | 9 | 8 | 8 | 25 |
| 5. ఆస్ట్రేలియా | 8 | 6 | 5 | 19 |
| 6. జపాన్ | 8 | 3 | 6 | 17 |
| 7. ద.కొరియా | 7 | 5 | 4 | 16 |
| 8. ఇటలీ | 5 | 8 | 4 | 17 |
| 9. నెదర్లాండ్స్ | 4 | 2 | 2 | 8 |
| 10. కెనడా | 3 | 2 | 5 | 10 |
| 45. ఇండియా | 0 | 0 | 3 | 3 |

గమనిక: స్వ:స్వర్ణం, ర:రజతం; కా:కాంస్యం; మొ:మొత్తం

**మీకోసం**

పొట్టు మినపప్పు వాడేవారు పొట్టుతో కలిపి పప్పు రుబ్బుకుంటే ఇడ్లీ, దోశ వగైరా వంటకాలు చాలా రుచిగా ఉంటాయి.

**జీవన సౌరభం**

స్థిరమైన గమ్యం, కచ్చితమైన మార్గం, రాజీలేని ప్రయత్నం ఉన్నప్పడే లక్ష్యాన్ని చేరుకోగలం.

JEEVANA
జీవన the family

# చిరు సాయం

అనగనగా ఒక ఊరిలో శ్వేత, నవ్య అనే ఇద్దరు స్నేహితులు ఉన్నారు. వారికి ఒకరంటే ఒకరికి చాలా ఇష్టం. ఒక రోజు ఇద్దరు కలిసి కూరగాయలు కొనడానికి బజారుకు వెళ్లారు. కూరగాయలు కొని తిరిగి వస్తుండగా దారి పక్కన ఒక అరుపు వినిపించింది. ఒక చిన్న కుక్క పిల్ల రోడ్డు పక్కన ఉన్న పెద్ద గుంతలో పడి, బయటకు రాలేక అరుస్తూ ఉంది. నవ్యకు ఒక ఆలోచన తట్టింది. దానిని శ్వేతకి చెప్పి, తొందరగా ఇంటికి వెళ్ళి ఒక బకెట్‌ని తీసుకొని రమ్మని చెప్పింది. 'నువ్వు బకెట్ తెచ్చేలోపల నేను బజారుకు వెళ్ళి ఒక తాడును తెస్తాను' అన్నది. కొద్దిసేపటి తరువాత శ్వేత బకెట్, నవ్య తాడును తీసుకుని వచ్చారు.

నవ్య బకెట్ కాడ మధ్య భాగంలో తాడును గట్టిగా కట్టింది. గుంతలోకి బకెట్‌ను మెల్లమెల్లగా ఇద్దరూ వదిలారు. కుక్కపిల్ల దగ్గరగా బకెట్‌ని ఉంచారు. అది ఎలాగోలా బకెట్‌లోకి ఎక్కింది. ఆ తరువాత ఇద్దరూ ఆ తాడుని పట్టుకుని కుక్క పిల్లను బయటకు లాగారు. కుక్క పిల్ల బయటికి రాగానే తోక ఊపుకుంటూ శ్వేత, నవ్య దగ్గరికి వెళ్లింది. అప్పుడు శ్వేత, నవ్య ఆనందంతో ఎగిరి గంతేశారు.

నీతి : చిరు సాయంలో కూడా అమితమైన ఆనందం పొందవచ్చు.

– పి.లక్ష్మీ ప్రణతి, 8వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నందలూరు,
అన్నమయ్య జిల్లా.

**తేడాలు గుర్తించండి**

పిల్లలూ! ఈ చిత్రంలో ఎనిమిది తేడాలు ఉన్నాయి. అవి ఏంటో గుర్తించండి.

## నేను గీసిన బొమ్మ

కె.రోహిణి,
9వ తరగతి,
జెడ్‌పిహెచ్ఎస్, నిజాంపేట్,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

# పరిమళించిన మానవత్వం

**వయనాడ్.. ఒకపక్క ప్రకృతి ప్రళయానికి చిగురుటాకులా వణికిపోతున్న మనుషులు. బురదమట్టిలో కొట్టుకుపోయిన వారి కోసమే కాదు, బురదలో కూరుకుపోయిన వాళ్లల్లో తమ వాళ్ల ఆచూకీ కోసం దేవులాడుతున్న భార హృదయులు. ఉన్న ఇల్లు కాదు, ఊరుకు ఊరే కొట్టుకుపోయి, కట్టుబట్టలతో మిగిలిపోయిన అభాగ్యులు. అలాంటి చోట ఆపన్నులను ఆదుకునేందుకు మానవతా దృక్పథంతో ఎందరో పనిచేస్తున్నారు. అనాథలుగా మిగిలిన పసి బిడ్డల ఆకలి తీర్చేందుకు కొందరు అమ్మలు తమ స్థన్యాన్ని అందిస్తున్నారు. తమలాంటి పిల్లలు కడుపునిండా ఇంత తిండి తినాలని చిన్నారులు కొందరు తాము దాచుకున్న చిన్ని మొత్తాలను దానం చేస్తున్నారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని ధీరవనితలు శక్తి వంచన లేకుండా అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు.**

మంగళవారం అర్ధరాత్రి వేళ, కేరళ వయనాడ్‌లో సంభవించిన ప్రకృతి ప్రళయంలో సహాయక చర్యలు చేపట్టేందుకు దేశ రక్షక దళం అక్కడికి చేరింది. వారితో పాటే, బెంగుళూరుకి చెందిన మద్రాస్ ఇంజినీర్ గ్రూప్ (ఎంఇజి) ఆర్మీకి సహాయం చేసేందుకు సమాయత్తమైంది. ఆర్మీ సిబ్బంది సేవలకు ఎక్కడా అంతరాయం కలగకుండా ఎక్కడికక్కడ రహదారులు నిర్మించడం, వంతెనలు కట్టడం ఎంఇజి విధి. 2018లో కూడా కేరళ వరదల్లో ఎంఇజీ విశేషంగా సేవ చేసింది. ఇప్పుడు కూడా ఆ బృందం వయనాడ్ చేరుకుంది. అయితే ఈసారి ఆ బృందంలో మేజర్ సీతా షెల్కే భాగమయ్యారు. మొత్తం 70 మంది బృందంలో ఆమె ఒక్కతే మహిళ.

## ధీరవనిత మేజర్ సీతా షెల్కే

ఎంఇజీ వచ్చిన దగ్గర నుండి ఓ బృహత్తర కార్యక్రమంలో భాగమైంది. సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న బురదనీటిపై బెయిలీ బ్రిడ్జి నిర్మాణం చేపట్టింది. శరవేగంగా పనులు జరుగుతున్నాయి. ఈ సమయంలోనే శుక్రవారం ఉదయం బెయిలీ బ్రిడ్జిపై పనులను పర్యవేక్షిస్తున్న మేజర్ సీత ఫొటో ఒకటి సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. చుట్టూ చిమ్మ చీకటి. కిందేమో సముద్రాన్ని తలపిస్తున్న బురద, ఏమాత్రం కాలుజారినా అంతేసంగతులు. ఆ చీకట్లో, ఆ బురదలో ఎక్కడికి కొట్టుకుపోతామో ఎవరికీ తెలియదు. అయినా ఏమాత్రం జంకకుండా బ్రిడ్జి రైలింగ్‌పై నుంచొని మేజర్ సీత వంతెన పనులను పర్యవేక్షిస్తున్నారు. ఆమెలోని ధైర్యసాహసాలు తన కళ్లల్లో కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. 31 గంటలు విశ్రాంతి తీసుకోకుండా పనిచేసిన ఆమె తెగువ, వివక్ష నిండిన ఈ సమాజంలో మహిళల శక్తిసామర్థ్యాలకు కొలమానంగా నిలబడింది. ఎప్పుడైతే మేజర్ సీత ఫొటో సోషల్‌మీడియాలో వైరల్ అయ్యిందో, కేరళ మీడియా 'పులి' అంటూ ఆమెని కొనియాడుతూ వార్తాకథనాలు రాసింది. కొంతమంది ఫేస్‌బుక్ యూజర్లైతే 'మీ ధైర్య సాహసాలకు గర్వపడుతున్నాం. చాలా తక్కువ సమయంలో బ్రిడ్జి నిర్మించాలన్న మీ పట్టుదలను ప్రశంసించకుండా ఉండలేకపోతున్నాం' అంటూ రాశారు.

ముండక్కల్ ప్రాంతానికి చేరుకోవడానికి ఉన్న ఒక్క వంతెన ఈ ఉపద్రవంలో కొట్టుకుపోయింది. దీంతో ఆ ప్రాంతానికి సహాయక బృందాలు చేరుకోవడం చాలా కష్టమైంది. దీంతో చౌరల్మాలాలో 190 అడుగుల బెయిలీ బ్రిడ్జి నిర్మించేందుకు ఎంఇజీ ముందుకొచ్చింది. ఆ పనుల్లో భాగంగానే 36 గంటల వ్యవధిలో ఎంతో సమర్థవంతంగా బెయిలీ బ్రిడ్జి నిర్మించారు.

**మేజర్ సీత గురించి ఇంకొంత..**

మహారాష్ట్ర అహ్మద్ నగర్‌కి చెందిన సీత, 2012లో ఆర్మీలో చేరారు. అప్పటి నుండి ప్రమాదాలు సంభవించిన పలు ప్రాంతాల్లో రక్షక పనుల్లో పనిచేస్తున్నారు. సహాయక చర్యలకు అంతరాయం కలగకుండా చేయడం, పెద్ద పెద్ద మెషినరీలు, భారీ యంత్రాలు, ఎక్స్‌వేటర్లను రప్పించి సకాలంలో వంతెనలు, రోడ్లు నిర్మించడంలో మేజర్ సీత పాత్ర అమోఘం.

## అమ్మ మనసు..

బిడ్డ ఆకలితో ఏడుస్తుంటే ఏ తల్లీ చూస్తూ ఊరుకోదు. ఆ బిడ్డ తనది కాకపోయినా ఆ క్షణం ఆమె హృదయం బరువెక్కుతుంది. ప్రస్తుతం వయనాడ్ ఘోరకలిలో ఎంతోమంది బిడ్డలు అనాథలుగా మిగిలిపోయారు. ఆకలితో అలమటిస్తున్నారు. ఈ పరిస్థితి ఎంతటి వారికైనా కన్నీరుతెప్పిస్తుంది. ఈ పరిస్థితుల్లోనే ఓ అమ్మ తన మాతృ హృదయాన్ని ఆ బిడ్డలకి పంచేందుకు సిద్ధమైంది. ఇడుక్కికి చెందిన ఇద్దరు బిడ్డల తల్లి, వయనాడ్ చిన్నారులకు తన స్థన్యాన్ని ఇచ్చేందుకు ముందుకొచ్చింది. ప్రభావిత ప్రాంతానికి చేరుకోవడానికి కుటుంబంతో సహా బయల్దేరింది. 'నేను ఇద్దరు బిడ్డలకి తల్లిని. తల్లి లేని పిల్లలు ఆకలితో ఎంత బాధపడతారో నాకు తెలుసు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను' అని ఆ తల్లి భావోద్వేగంతో చెబుతోంది.

## సోషల్ మీడియాలో ...

సేవింగ్స్ బ్యాంక్‌లో దాచుకున్న చిల్లరతో కలెక్షన్ సెంటర్‌కు వచ్చిన ఐదిన్ అనే చిన్నారి కేరళ ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళం అందిస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

కొండచరియలు విరిగిపడి కొన ఊపిరితో బయటపడ్డ బాధితుల కోసం సుల్తాన్ బాతేరి బ్లడ్ బ్యాంక్‌లో రక్తం ఇచ్చేందుకు క్యూ కట్టిన జనం ఉన్న ఫొటో సోషల్ మీడియాలో షేర్ అయ్యింది. 'కులం, మతం కన్నా మానవత్వమే మిన్న..' అంటూ ఈ ఫొటోకి క్యాప్షన్ కూడా ఇచ్చారు.

ఇలా ఎంతోమంది మానవత్వ హృదయులు వయనాడ్ గుండెలకు ఊపిరిలిస్తున్నారు.

సోషల్ మీడియా సౌజన్యంతో

## చిన్నారి నేస్తాలు..

సోషల్ మీడియా సౌజన్యంతో

ఈ విషాదంలో ఎవరికి తోచిన సాయం వారు చేసేందుకు ఎంతోమంది ముందుకువస్తున్నారు. ఇంతమందిలో 'మేము కూడా' అని చిన్నారులు కూడా భాగమవుతున్నారు. కేరళ తిరువనంతపురానికి చెందిన మూడేళ్ల నైతిక్ నితిన్ తన పుట్టినరోజు కోసం పొదుపు చేసిన డబ్బులను ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా పంపించాడు. నైతిక్ తండ్రి నితిన్ అప్పర్ స్కూలు ఉపాధ్యాయుడు. తల్లి దీప్తి బ్యాంకు ఉద్యోగి. తల్లిదండ్రులతో వచ్చి మరీ ఈ సొమ్మును నైతిక్, జిల్లా కలెక్టర్‌కి అందించాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68